
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 26 మార్చి 2025 | 5

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6 : 20 (బుధవారం సాయంత్రం)
సహర్ : 4:41 (గురువారం ఉదయం)



కుక్కల దాడిలో గాయాలపాలైన చిన్నారి

అమ్మానుషం!

- ముళ్ల పొదల్లో చిన్నారి
- కుక్కలు పీక్కుతిన్న వైనం
- ఆసుపత్రికి తరలింపు

నల్లజర్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అమ్మ నులివెచ్చని పొత్తిళ్లలో ఉండాల్సిన చిన్నారిని వద్దని విసిరేయడంతో.. కుక్కలు పీక్కుతిన్న విషాదఘటన తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పోతవరంలో మంగళవారం చోటుచేసుకుంది. పోతవరం-యర్నగూడెం రోడ్డులో పొగాకు బ్యారన్ల దగ్గర ఉన్న ముళ్లపొదల్లో ముక్కుపచ్చలారని ఆడశిశువును గుర్తు తెలియని వ్యక్తులు పడేసి వెళ్లిపోయారు.ఉదయం పాలు తీసుకురావాడానికి అటుగా వెళ్తున్న రైతులు శిశువును కుక్కలు పీక్కుతినడం చూసి విస్తుపోయారు. వెంటనే కుక్కలను తరిమికొట్టి శిశువును కాపాడి వైద్యసిబ్బందికి సమాచారం అందించారు.ఈ మేరకు ఏఎన్ఎం మహాలక్ష్మి,గ్రామ సంరక్షణ అధికారి దీపిక సంఘటనా స్థలానికి వెళ్లి రక్తపు మడుగులో ఉన్న శిశువును తీసుకుని వచ్చి ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం డాక్టర్ రాజశేఖర్ శిశువును పరిశీలించి మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శిశువుకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి రక్తం ఎక్కించారు.నల్లజర్ల సీఐ వై.రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలానికి వెళ్లిన సీఐ సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు. సీడీపీవో నాగలక్ష్మి, ఏసీడీపీవో పద్మావతి, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి ఏలూరు వెళ్లి శిశువును పరిశీలించి సంరక్షణ కోసం ఇద్దరి ఆయాలను అక్కడ ఉంచారు. మరో 48 గంటలు దాటితే తప్ప ఆరోగ్య పరిస్థితి చెప్పలేమని వైద్యులు తెలిపినట్టు సీడీపీవో నాగలక్ష్మి తెలిపారు.

రేపు ఎన్నికల సందడి

ఒక ఎంపీపీ, రెండు కో ఆప్షన్, 12 ఉపసర్పంచ్ పదవులకు

రాజమహేంద్రవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఒక ఎంపీపీ, 12 ఉపసర్పంచ్, రెండు కో ఆప్షన్ సభ్యుల పదవులకు గురువారం ఎన్నిక నిర్వహించనున్నట్టు జేసీ ఎస్.చిన్నరాముడు తెలిపారు.కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం ఎన్నికల అధికారులు, సమన్వశాఖల అధికారులతో సమీక్షించారు. గురువారం ఉదయం 11 గంటలకు ఎన్నికలు పరోక్ష పద్ధతిలో ఎన్నికలు జరుగుతాయన్నారు. బిక్కవోలు ఎంపీపీ,పెరవలి,రంగంపేట మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక నిర్వహిస్తారన్నారు. గోకవరం మండలం మల్లేశ్వరం,కొవ్వూరు మండలం పెనకనమెట్ట, రాజానగరం మండలం పాతతుంగపాడు, గోపాలపురం మండలం కొవ్వూరుపాడు, వెంకటాయపాలెం, తాళ్లపూడి మండలం తాడిపూడి,అనపర్తి మండలం లక్ష్మీనరసింహాపురం, రంగంపేట మండలం మర్రిపూడి, కడియం మండలం మురమండ, సీతానగరం మండలం మునికూడలి, ఉండ్రాజవరం మండలం ఉండ్రాజవరం గ్రామ ఉపసర్పంచ్ పదవులకు ఎన్నిక జరగనుందన్నారు. ఎంపీపీ, కోఆప్షన్ సభ్యుల ఎన్నికకు ఆ రోజు ఉదయం 10 గంటలకు నామినేషన్లు స్వీకరించి మధ్యాహ్నం 12 గంటల్లోపు పరిశీలన పూర్తి చేయాలని చెప్పారు.తర్వాత అర్హుల జాబితా ప్రకటించాలన్నారు.అభ్యర్థిత్వ ఉపసంహరణ గడువు మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ఉంటుందని చెప్పారు.

అమ్మా.. నేను మోసపోయా!



అమ్మా నేను మోసపోయా.. నాకు బతకాలని లేదు..
నా గురించి బాధపడొద్దు.. నా అవయవాలన్నీ దానం చేయండి
అంటూ ఒక వైద్య విద్యార్థిని సూసైడ్ నోట్ రాసి 23వ తేదీన ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది..ఆమె పరిస్థితి విషమంగా ఉంది. ప్రస్తుతం ఆ విద్యార్థిని బొల్లినేని కిమ్స్ ఆసుపత్రిలో ఇంటర్న్‌షిప్ చేస్తోంది. ఆ ఆసుపత్రిలో పనిచేసే ఒక వ్యక్తి వేధింపుల కారణంగానే యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని మంగళవారం సహచర విద్యార్థులు ఆందోళనకు దిగారు.. నిందితుడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.ఎండను సైతం లెక్కచేయకుండా రోడ్డుపై బైఠాయించారు. రాజానగరం, రాజమహేంద్రవరం ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆసుపత్రి వద్దకు చేరుకుని ఆందోళనకారులను సముదాయించారు. ఆడబిడ్డకు అన్యాయం జరిగితే సహించబోమని హెచ్చరించారు. - వివరాలు 6లో



కూటమిలోనూ.. కదలికేది!

రాజమహేంద్రవరంలో మెడికల్ కళాశాల నిర్మాణం ఇలా...

- మెడికల్ విద్య..మిథ్య
- తూర్పున కళాశాల ఆరంభం
- వసతులు చూస్తే అరకొరే
- కోనసీమలో భవనాలే లేవు
- నేటికీ పునాది దాటని వైనం
- నాలుగేళ్లయినా నేటికీ ఇంతే
- వైసీపీ నిర్వాకం..సాగని పనులు
- రంగరాయలోనూ వసతుల్లేవ్
- 10 నెలలైనా పట్టని కూటమి
- మెడికల్ విద్యార్థుల ఇక్కట్లు

నాడు అంతన్నారు.. ఇంతన్నారు.. పూర్తిచేయకుండా వదిలేశారు.. నాలుగేళ్లయ్యింది.. నేటికీ నిర్మాణంలోనే ఉన్నాయి.. ఇదీ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మెడికల్ కళాశాలల తీరు.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్ర వరంలో అయితే భవన నిర్మాణాలు పూర్తికాకుండానే తరగతులు ప్రారంభించేశారు.. సౌకర్యాలు చూస్తే అరకొరే.. విద్యార్థులకు ఇబ్బందే.. అయినా పట్టించుకునేవారే లేరు.. కన్నెత్తి చూసేవారు కానరావడంలేదు.. ఇక అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అయితే నేటికీ భవన నిర్మాణాలు పునాది దశనూ దాటలేదు..ఎక్కడి పనులు అక్కడే అన్నట్టు ఉన్నాయి.. కాకినాడ జిల్లా రంగరాయ మెడికల్ కళాశాలలోనూ నేటికీ సమస్యలు వెన్నాడుతు న్నాయి.. గత సర్కారులో సరే సరి.. కూటమి ప్రభుత్వంలోనూ కదలికలేకపోవడంపై 'ఆంధ్రజ్యోతి' ఫోకస్..

మెడికల్ కళాశాలల నిర్మాణ పనులు నత్తనడక

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వం ఆర్భాటాలకే కానీ.. వాస్తవ రూపంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించక పోవడం వల్ల మెడికల్ కాలేజీ, కొత్త ఆసుపత్రి నిర్మాణ పనులు నత్తనడకన సాగాయి. కూటమిలోనైనా వేగం పుంజుకున్నాయా అంటే అదీ లేదు. సమస్య ఏమిటో కానీ నాడు పనులు ఎలా ఉన్నాయో నేటికీ అలాగే ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నా కాంట్రాక్టర్లు వేగంగా పనిచేయడం లేదనే అక్కడి అధికారులే చెప్పడం గమనార్హం. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మొత్తం రూ.475 కోట్లతో మెడికల్ కాలేజి, ఆసుపత్రి భవనాలు నిర్మించాల్సి ఉంది.కానీ ఇప్పటి వరకూ కేవలం రూ.100 కోట్ల పని మాత్రమే జరిగింది. ఏడాదికి 150 మంది విద్యార్థులతో నడుస్తున్న ఈ కాలేజీలో ప్రస్తుతం రెండో బ్యాచ్ నడుస్తోంది. సెప్టెంబర్‌కు మూడో బ్యాచ్ వస్తుంది. ప్రతి ఏడాది 150 సీట్లలో 110 నుంచి 120 వరకూ అమ్మాయిలే చేరడం గమనార్హం. వారు ఇంత వరకూ హాస్టల్ సౌకర్యం లేక ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం బాలికలు 360 మందికి, బాలురు 120 మందికి సరిపడా హాస్టల్ కట్టారు.కానీ ఇవి ఇంకా పూర్తిగా అందుబాటులోకి లేదు.అంతే కాకుండా కాలేజీ భవనం పూర్తి కాలేదు. మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు క్లాసులు పీఈడీ (నర్సింగ్ విద్యార్థులకు నిర్మించిన) భవనంలో జరుగుతున్నాయి. మూడో బ్యాచ్ సెప్టెంబరులో రానుంది.అప్పటికి కొత్త కాలేజీ భవనం నిర్మాణం కాకపోతే ఇబ్బందే.కొత్త కాలేజీ భవనంలో 17 శ్లాబ్‌లకు 15 పూర్తి చేశారు.ఇంకా రెండు పూర్తి చేయాలి. విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.ఇక్కడ మెడికల్ కళాశాలకు అనుబంధంగా 500 పడకల కొత్త బోధనాసుపత్రి నిర్మించాల్సి ఉంది.దానికి భూమిని సిద్ధం చేసినా కదలిక లేదు.ఇప్పటికే పేషెంట్ల సంఖ్య పెరిగిందని,పుష్కరాల నాటికి బాగా పెరుగుతుందని, అప్పటికి కొత్త ఆసుపత్రి అందుబాటులోకి రావాలని ఇటీవల ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు.గత వైసీపీ అసలు కొత్తభవనం గురించి పట్టించుకోలేదు. కూటమి వచ్చిన తర్వాత పాత భవనాలు తొలగించి స్థలాన్ని సిద్ధం చేసినా పనులు ఆరంభంకాలేదు.



కోనసీమలో ఆగిపోయిన మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు

కోనసీమలో ఆగిపోయిన పనులు..

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

నాలుగేళ్లు కావొస్తున్నా ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణాలు పునాదుల దశలను దాటలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కళాశాల నిర్మాణ పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం సెక్యూరిటీ గార్డుల పర్యవేక్షణలోనే పునాదుల్లో ఉన్న భవనాలు, నిర్మాణ సామగ్రి ఉన్నాయి. వందల కోట్లతో చేపట్టిన వైద్య కళాశాల భవనాల్లో కొన్ని శ్లాబ్‌ల దశలకు చేరుకున్నాయి. ప్రధాన వైద్య కళాశాల భవనం పునాదుల స్థాయికి మాత్రమే పరిమితమైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణానికి కూతవేటు దూరం సమనస గ్రామంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021 మే 31న అప్పటి సీఎం వైఎస్ జగన్ వర్చువల్ విధానంలో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నాటి నుంచి వైద్య కళాశాల నిర్మాణ పనుల ప్రగతి 'మిథ్య'గా మారింది. 56 ఎకరాల్లో రూ.475 కోట్లతో చేపట్టిన ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. 32 భవనాలు నిర్మించాల్సి ఉన్నా ప్రస్తుతం 17 భవనాలు వివిధ దశల్లో మాత్రమే నిర్మించడానికి కాంట్రాక్టు సంస్థ అయిన మెగా ఇంజనీరింగ్ చర్యలు చేపట్టింది. ప్రధానమైన 750 పడకల ఆస్పత్రి కీలక భవనంతో పాటు ఆరు బ్లాకులతో వైద్య కళాశాల భవనాలు శ్లాబ్‌ల దశకు చేరుకున్నాయి. మిగిలిన బాయ్స్, లేడీస్ హాస్టల్స్ భవనాలు కొన్ని శ్లాబ్‌లు పూర్తయ్యాయి. వివిధ రకాల ల్యాబ్‌లు నిర్మాణ పనులు పునాదుల దశలోనే నిలిచిపోయాయి. ఈ వైద్య కళాశాల నిర్మాణ పనులు వచ్చే నెల ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని నాడు వైసీపీ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. కాంట్రాక్టు సంస్థకు సకాలంలో బిల్లులు చెల్లించక పోవడమే పనులు నత్తనడకన జరగానికి కారణమని సమాచారం. సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటై పది నెలలు కావొస్తున్నా వైద్య కళాశాల నిర్మాణ ప్రగతిపై ప్రభుత్వం ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రస్తుతం కళాశాల నిర్మాణ పనుల్లో కీలక పాత్ర వహించిన మెగా సంస్థ స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యాలయాలు, ఇతర సామగ్రిని ఖాళీ చేసి వెళ్లిపోయినట్టు సమాచారం. మరి ఈ కళాశాల భవనాల నిర్మాణాలు మళ్లీ పునః ప్రారంభమయ్యేది ఎప్పుడో వేచి చూడాల్సిందే.





కోనసీమలో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తున్న ఐరన్

కాకినాడ రంగరాయలోనూ

ఇంతేగా!

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలోనే అత్యంత ప్రఖ్యాతి చెందిన రంగరాయ మెడికల్ కాలేజీని అనేక సమస్యలు వెన్నాడుతున్నాయి.సమర్థవంతమైన వైద్యులను తయారు చేయడంతో పేరొందిన ప్రభుత్వ మెడికల్ కాలేజీ అనేక వసతుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా అనేక పనులకు టెండర్లు పిలిచి ఆనక నిధులివ్వకపోవడంతో ఇప్పుడవన్నీ వెక్కిరిస్తున్నాయి. ఎప్పుడు పూర్తవుతాయో తెలియక ఎదురుచూస్తున్నాయి.ప్రధానంగా మెడికల్ కాలేజీ విద్యార్థులకు సంబంధించి ఏడాదిగా వసతి గృహాల బ్లాకులు కదలకుండా ఆగిపోయాయి.దాదాపు రూ.70 కోట్లతో ప్రారంభించిన రెండు యూజీ, పీజీ వైద్యుల హాస్టల్ బ్లాకుల నిర్మాణం ప్రారంభమైనా నిధుల్లేక పనులకు గ్రహణం పట్టింది. వందల్లో ఉన్న వైద్యవిద్యార్థులకు జీప్లస్5, జీప్లస్ 4 విధానంలో రెండు బ్లాకుల నిర్మాణం గతేడాది ప్రారంభం కాగా ప్రస్తుతం జీప్లస్5 బ్లాక్ మొదటి అంతస్తు నిర్మాణ దశలోనే ఉంది. జీప్లస్4 బ్లాక్ అయితే ఇంకా పునాదుల స్థాయి దాటలేదు.వైద్య విద్యార్థినులకు సంబంధించి యూజీ, పీజీ వైద్యుల కోసం రూ.100 కోట్లతో జీప్లస్ 5, జీప్లస్ 8 కింద రెండు బ్లాకుల నిర్మాణం ప్రారంభించారు.గతేడాది నుంచీ పనుల్లో కదలికలేదు. నిధుల్లేకపోవడంతో కాంట్రాక్టర్ అడ్రస్ లేదు. జీజీహెచ్‌కు ఇన్‌పేషెంట్ రోగుల తాకిడి అధికంగా ఉండ డంతో కొన్నాళ్ల కిందట సూపర్‌స్పెషాలిటీ బ్లాకులను నిర్మించాలని అధికారులు నిర్ణయించారు.జీజీహెచ్‌కు అనుబంధంగా నర్సింగ్ కాలేజీ, హాస్టల్ నిర్మించాలని భావించి సమీపంలో ఆరెకరాల ప్రభుత్వ భూమి కేటాయించినా పనులు జరగకుండా నిలిచిపోయాయి.

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ మృతి

- హత్య చేశారని ఆరోపణ
- ప్రభుత్వాసుపత్రి వద్ద ఉద్రిక్తత
- మృతుడిది హైదరాబాద్

7



కడుపునింపని ఉపాధి!

- ఉపాధి పనిచేస్తున్నా.. పస్తులే
- రెండు నెలలగా అందని వేతనాలు
- రూ. 11.70 కోట్ల బకాయిలు
- నేటికీ అకౌంట్లకు జమకాని వైనం
- లబోదిబోమంటున్న కూలీలు

గోకవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు వేతనాలు నిలిచిపోయాయి. సుమారు రెండు నెలలకు పైగా వారికి కూలీ అందడం లేదు. దీంతో ఆ కుటుంబాల వారికి పోషణ కరువై ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పటికి అందుతాయో అధికారులు ఖచ్చితంగా చెప్పలేకపోతున్నారు. 15 రోజుల్లో వేతనాలు చెల్లించాలనే నిబంధనలు ఉన్నా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. జిల్లాలోని 18 మండలాల్లో మొత్తం లక్షా 26 వేల మంది జాబ్‌కార్డుదారులు ఉన్నారు. వీరిలో ప్రస్తుతం 15,472 మంది ఉపాధి పనికి వెళుతున్నారు. ఇంత వరకు సుమారు రూ.11.70 కోట్లు బకాయిలు కూలీలకు చెల్లించాల్సి ఉంది. మరో రూ.46.42 కోట్లు మెటీరియల్ బకాయిలు రావాల్సి ఉంది. చివరి సారిగా ఈ ఏడాది జనవరి మొదటి వారంలో కూలీలకు వేతనాలు చెల్లింపులు జరిగాయి. ఆ తరువాత ఇప్పటి వరకు ఒక్క రూపాయి వారి బ్యాంక్ ఖాతాలో జమకాలేదు. రెండు నెలలుగా అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనుల్లేక.. ఉపాధి వేతనం అందక లబోదిబోమంటున్నారు. తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో నెట్టుకొస్తున్నారు. కొందరు కూలీలైతే ఉపాధి వేతనాలు వచ్చాక చెల్లించేస్తామంటూ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు రుణాలు తెచ్చి కుటుంబాలను పోషిస్తున్న ఘటనలు ఉంటున్నాయి. గోకవరం మండలంలో 11,183 మందికి జాబ్ కార్డులు ఉండగా వీరిలో సరాసరి రోజుకు 1200 నుంచి 1300 మంది వరకు ఉపాధి పనులకు వెళుతున్నారు. ఇప్పటి వరకు 1246 కుటుంబాలకు వంద రోజుల పనిదినాలు పూర్తయినట్టు ఉపాధి హామీ పథకం అధికారులు చెప్పుకొస్తున్నారు. ప్రస్తుతం పనికి వస్తున్న కూలీలకు వేతనాలు అందడంలేదు.మండలంలో ఇంకుడు గుంతలు, ఫారం పాండ్స్‌మినీ గోకులాలు తదితర పనులు జరుగుతున్నాయి.ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే కూలీల ఖాతాల్లోకి జమ చేస్తామని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో 10 ఆర్‌వోబీల నిర్మాణం



అమరావతిలో మంగళవారం జరిగిన సీఎం చంద్రబాబు కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ ప్రశాంతి

- సీఎం కాన్ఫరెన్స్‌కు కలెక్టర్
- పలు అంశాలపై నివేదికలు రెడీ
- నేడు సీఎం ముందు ప్రజంటేషన్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడంతో జిల్లాకు మంచిరోజులు వస్తున్నాయి. సీఎం చంద్రబాబునాయుడు విజన్‌తో కలెక్టర్ పి.ప్రశాంతి 2025-26 జిల్లా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు.అమరావతిలో మంగళవారం సీఎం చంద్రబాబు సమక్షంలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ మొదలైన సంగతి తెలిసిందే. ఇది బుధవారం కూడా జరగనుంది. షెడ్యూల్ ప్రకారం బుధవారం కలెక్టర్ యాక్షన్ ప్లాన్‌ను సీఎం ముందు ప్రజంటేషన్ చేయనున్నారు. వ్యవసాయం నుంచి టూరిజం వరకూ అభివృద్ధిపై పలు అంశాలతో విజన్ డాక్యుమెంటరీ సిద్ధం చేశారు. జిల్లాలో 77,820 హెక్టార్లలో పంట లక్ష్యంగా నిర్ణయించారు. 4970 హెక్టార్లలో ఉద్యాన పంటలను ప్రోత్సహించనున్నారు. జిల్లాలో 12 శాతం నుంచి 15 శాతం వరకూ పాలు, మాంసం, గుడ్ల వృద్ధి రేటు లక్ష్యంగా పెట్టుకున్నారు. 2 వేల హెక్టార్లలో మత్స్య సంపదను అదనంగా పెంచే లక్ష్యం పెట్టుకున్నారు.కడియంలో క్రైయో ప్రిజర్వేషన్ ల్యాబ్ స్థాపిస్తారు.రెవెన్యూ పెంచడమే లక్ష్యంగా జిల్లాలో మైనింగ్ అండ్ క్వారీయింగ్‌కు లీజులను ఆపరేషన్‌లోకి తీసుకురానున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ వృద్ధి కోసం నానో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయనున్నారు. విశ్వకర్మ యూనిట్లను స్థాపిస్తారు. కల్వచర్లలో ఇండస్ట్రియల్ పార్కు అండ్ జియో-బయోఫ్యూయల్ ఇండస్ట్రీని ప్రారంభించనున్నారు. జిల్లాలో పీఎం సూర్యఘర్ పథకం కింద 7500 కిలో వాట్స్ సామర్థ్యంతో 2500 ఇళ్లపై రూఫ్‌టాప్ ఏర్పాటు చేయనున్నారు. పంచాయతీ రాజ్ శాఖ కింద జిల్లా వ్యాప్తంగా 12 మండలాల పరిధి లోని 49 హేబిటేషన్లలో రూ.29.24 కోట్ల నాబార్డ్ నిధులతో 17 పనులను పూర్తి చేయనున్నారు.రూ.85 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 160 కిలోమీటర్ల మేర సీసీ, బీటీ రోడ్లు నిర్మించనున్నారు. నిడదవోలు వద్ద ఆర్వోబీని రూ.184.74 కోట్లు, రాజానగరం నుంచి సామర్లకోట వరకూ రూ.298.70 కోట్లతో ఏడీబీ రోడ్డు అభివృద్ధి చేస్తున్నారు. ఖమ్మం మీదగా పట్టిసీమ జిల్లా వరకూ 40.4 కిలోమీటర్ల మేర రూ.368.63 కోట్లతో జాతీయ రహదారిని నిర్మించనున్నారు.జిల్లాలో 10 ఆర్వోబీలు నిర్మించనున్నారు. జిల్లాలో 10,794 ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నారు. రూ.347.15 కోట్లతో జరుగుతున్న రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టు రెండో టెర్మినల్ పనులు వచ్చే ఆగస్టు 30వ తేదీ నాటికి పూర్తి చేస్తారు. భవనాలకు రూ. 204 కోట్లు ఖర్చుచేస్తున్నారు. అక్టోబరులో ఇంటర్నేషనల్ ఫ్లవర్ షో కడియపులంకలో నిర్వహించనున్నారు.బ్రిడ్జిలంకలో అడ్వంచర్ స్పోర్ట్స్ అభివృద్ధి చేస్తారు. విజయవాడ- వైజాగ్ రైల్వే రూట్‌లో డబ్లింగ్ కింద శెట్టిపేట,సింగవరం, తాళ్లపాలెం గ్రామాల మీద బైలైన్ నిర్మించనున్నారు. బొమ్మూరు వద్ద ఎస్‌సీడీసీ స్కీమ్ కింద వరల్డ్ లార్జెస్ట్ గ్రెయిన్ స్టోరేజీ అండ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రతిపాదించారు. దీని వల్ల 5 వేల మంది రైతులు లబ్ధి పొందుతారు. 16 ఎంపీ ఎఫ్‌పీ (మల్టీ పర్పస్ ఫెసిలిటేటింగ్ సెంటర్లు)నిర్మిస్తున్నారు.దీని వల్ల వెయ్యి మంది రైతులు లబ్ధి పొందనున్నారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్‌కాలేజీ, ప్రభుత్వాసుపత్రుల వద్ద 4జీ సాట్యురేషన్ ప్రాజెక్టులను నెలకొల్పనున్నారు. కొవ్వూరు వద్ద 50 పడకల ఆసుపత్రిని 150 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయనున్నారు.బయ్యవరం, తుపాకులగూడెం ప్రాంతాల్లోని వైట్‌ఫీల్డ్ పేపరుమిల్లు ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన 271.35 ఎకరాల భూమి ఇండస్ట్రియల్ పార్కుకు కేటాయించనున్నారు.



వైద్యులను ప్రశ్నిస్తున్న భద్రాచలం మాజీ ఎంపీ మిడియం బాబూరావు

బలభద్రపురంలో 102 మందికి పరీక్షలు

అనపర్తి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : బిక్కవోలు మండలం బలభద్రపురంలో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు రెండో రోజైన సోమవారం కొనసాగాయి. స్వతంత్ర హాస్పిటల్, జీఎస్ఎల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం 102 మంది అనుమానితులు వైద్య పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో ఐదుగురికి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. తొమ్మిది మందికి ఎక్స్‌రేలు, 23మందికి ఆల్ట్రా సౌండ్ స్కానింగ్‌లు, ఆరుగురికి సర్వేకల్ కేన్సర్ టెస్టులు నిర్వహించారు. బుధవారం కూడా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు.గ్రామంలో జరుగుతున్న వైద్య శిబిరాన్ని సీపీఎం నాయకుడు, భద్రాచలం మాజీ ఎంపీ మిడియం బాబూరావు సందర్శించి వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడి పరిస్థితులు తెలుసుకునేందుకు వచ్చానని వైద్యులను, బాధితులను అడిగి కొన్ని వివరాలు తెలుసుకున్నానన్నారు.పార్టీ పెద్దలతో చర్చించి వివరాలను వెల్లడిస్తానని తెలిపారు.

కోటివారి అగ్రహారంలో సినిమా షూటింగ్ సందడి

అంబాజీపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అంబాజీపేట మండలం మాచవరం పరిధి కోటి వారి అగ్రహారం మేడిది సత్తిరాజు వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం బంగారు ముురుగు సినిమా షూటింగ్ జరిగింది. ముత్యాలపల్లికి బ్యానర్పై ప్రఖ్యాత చిత్రకారుడు కూచి, ఆర్ట్ డైరెక్టర్ బ్నిం పర్యవేక్షణలో రమణ రచయితగా, డొక్కా ఫణి దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఇందులో తనికెళ్ల భరణి, ఐడ్రీమ్ అంజలి, ప్రదీప్, సరస్వతి, జెన్ని, రత్నసాగర్ నటిస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఫణీంద్ర గొల్లపల్లి తెలిపారు. 1969 నుంచి 1980 వరకు బామ్మ, మనవడి మధ్య జరిగే సన్నివేశాలను ఈ చిత్రంలో తెరకెక్కిస్తున్నారు. బామ్మ పాత్రలో రత్నసాగర్ ముఖ్య పాత్ర పోషిస్తోందన్నారు. హీరో, హీరోయిన్‌గా కొత్తవారిని పరిచయం చేస్తున్నట్టు చెప్పారు. పార్థు నిమాని మ్యూజిక్ డైరెక్టర్‌గా, ప్రముఖ గాయకురాలు చిత్ర రెండు పాటలు పాడారన్నారు. రెండువారాల కోనసీమ ప్రాంతంలో షూటింగ్ ఉంటుందన్నారు.



ఓ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం

మంచి కథతోనే నటుడికి గుర్తింపు

● ప్రముఖ హాస్యనటుడు జెన్నీ



నాటకం, సినిమాలోని మంచి కథతోనే నటుడికి తగిన గుర్తింపు వస్తుందని ప్రముఖ హాస్యనటుడు జెన్నీ అన్నారు. షూటింగ్‌లో భాగంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. మాది కోనసీమ జిల్లాలోని ఆలమూరు. హైదరాబాద్‌లోని ఈసీఎల్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేశా. నాటకాలపై ఉన్న మక్కువతో సినిమారంగంలోకి వచ్చా. 1986లో జంధ్యాల సినిమాలో తొలి అవకాశం లభించింది. ఇప్పటివరకు 400 సీరియల్స్, 300 సినిమాల్లో నటించాను. ఎండమావులు, లేడీడిటెక్టర్, అంతరంగాలు సీరియల్స్ మంచి గుర్తింపు తెచ్చాయి. దాదాపు 80 కథలు రాయగా, అందులో 30 కథలకు ప్రత్యేక బహుమతులు అందుకున్నా.

1960లో సినిమా ఇండస్ట్రీకి వచ్చా

● సీనియర్ నటి రత్నసాగర్



1960లో సినీ ఇండ్రస్ట్రీకి వచ్చా. ఇప్పటి వరకు 250 సినిమాలు, మూడవేలకు పైగా సీరియల్స్ లో నటించా. కారాలు - మిరియాలు సినిమాకు నంది అవార్డు లభించింది. ముగ్గురు మొనగాళ్లు, లక్ష్మీనరసింహ, ముద్దుల ప్రియుడు చిత్రాలు మంచి గుర్తింపును తెచ్చాయి. కోనసీమ అందాలు మరువలేను, ఈ ప్రాంత వాసులు చూపే ఆప్యాయత, అనుబంధాలు మరిచిపోలేనివి.

చల్లంగ చూడమ్మా..!

● 28 నుంచి చింతలూరు నూకాంబిక జాతర ప్రారంభం
● ఆలయం వద్ద కట్టుదిట్టమైన భద్రత
● ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు
● లక్షలాదిగా తరలిరానున్న ఉభయ గోదావరి జిల్లాల భక్తులు

ఆలమూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాల్లో పేరుగాంచిన ప్రధాన జాతరలో ఆలమూరు మండలం చింతలూరు నూకాంబిక జాతర ఒకటి. ఈనెల 28 నుంచి ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో 28న జాతర మహోత్సవం, 29న తీర్థం, 30న ఉగాది ఉత్సవాలతోపాటు మొత్తం నెలరోజుల పాటు జాతర జరగనుంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజుచౌదరి తెలిపారు. దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లను సేవాకమిటీలు ఇప్పటికే ఏర్పాటు చేశాయి. లక్షలాది మంది తరలిరానున్న ఈ జాతరను సమర్థవంతంగా నిర్వహించాలని పలుశాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమీక్షలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ సూచించారు. చంటిపిల్లల దేవతగా కొలిచే అమ్మవారికి జాతర ఉత్సవాలలో పలువురు దర్శించుకుని మొక్కుబడులు, చెల్లించుకుని వారపోత, తుళ్లిబిళ్ల, కావిడి కోళ్లు, గండా దీపం ఇక్కడ ప్రధానంగా మొక్కులు తీర్చుకుంటారు.సాధారణంగా చంటిపిల్లలో వచ్చే ఆటలమ్మ, పొంగు వంటి వ్యాధులు అమ్మవారి ఆగ్రహం వల్ల వస్తాయని, అందువల్ల ఈవ్యాధి సోకిన చంటిపిల్లలచేత ఈ మొక్కులు తీరుస్తుంటారు. అలాగే ఈ వ్యాధులు రానివారు అమ్మవారి అనుగ్రహం ఉందని మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. దీంతో పూర్వపు ఉభయగోదావరి జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు చింతలూరు తరలి వస్తుంటారు. జాతరకు వచ్చే భక్తుల కోసం రావులపాలెం, అమలాపురం, రాజమహేంద్రవరం, రామచంద్రాపురం డిపోల నుంచి ఇక్కడికి ప్రత్యేక బస్సులను నడుపుతారు. జాతర ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ చెప్పారు. జాతర సమయంలో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతాయని స్థానికులు దీనికి సహకరించాలని వారు కోరారు.



చింతలూరు నూకాబింక అమ్మవారు





పునర్నిర్మాణం తరువాత ఆలయం, జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే పూలగరగ

మలబార్ ట్రస్టు దాతృత్వం

● ఇంటర్ విద్యార్థినులకు రూ.24 లక్షల స్కాలర్‌షిప్‌ల అందజేత



స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసు, మలబార్ సంస్థ డైరెక్టర్ హిషాం మహమ్మద్ ఆలీ, తదితరులు

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మలబార్ ట్రస్టు ద్వారా ఇంటర్మీడియేట్ బాలికలకు రూ. 24 లక్షల స్కాలర్‌షిప్‌ల అందజేశారు. స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద ప్రముఖ వ్యాపార సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూం, మలబార్ నేషనల్ స్కాలర్‌షిప్ ప్రోగ్రాం సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగం గా మంగళవారం స్థానిక శ్రీ త్యాగరాజ నారాయణదాస సేవా సమితి ప్రాంగణంలో ఉభయ గోదావరి జిల్లాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 246 మంది బాలికలకు రూ. 24 లక్షల స్కాలర్‌షిప్‌లను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మలబార్ సంస్థ సామాజిక సేవా తత్పరతను కొనియాడారు. సంస్థ డైరెక్టర్ హిషాం మొహమ్మద్ ఆలీ మాట్లాడుతూ మలబార్ సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా మహిళా సాధికారత కోసం ఇప్పటివరకు దేశ వ్యాప్తంగా 95 వేల మందికి పైబడి రూ. 60 కోట్ల స్కాలర్‌షిప్‌లను అందజేసిందన్నారు. బాలికల విద్యపై దృష్టి సారించడం ద్వారా, సమాజాన్ని ప్రగతి పథంలో నడిపించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, భావితరాల సామాజిక, ఆర్థిక పురోగతికి కృషి చేస్తున్నామన్నారు. అసి స్టెంట్ మార్కెటింట్ మేనేజర్ అయ్యప్పస్వామి, సేల్స్ టీం నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఎంపికైన బాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'కోకో'కు గిట్టుబాటు ధర కల్పించాల్సిందే

● కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన
● ఆర్డీవో రాణీసుస్మితకు వినతిపత్రం అందజేత



ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కోకో రైతులు

కొవ్వూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : రైతుల వద్ద గల కోకో గింజలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి, కొనుగోలు చేయాలని కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట కోకో రైతులు ఆందోళన చేశారు. అనంతరం ఆర్డీవో డా. రాణీసుస్మితకు వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ గత నెలరోజులుగా కోకో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నప్పటికీ.. ప్రభుత్వం గానీ, అధికారులు గానీ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కోకో గింజలు కొనుగోలు చేసే కంపెనీలు సిండికేట్‌గా మారి ధర తగ్గించి రైతులను నిలువునా మోసగిస్తున్నాయన్నారు. అన్ సీజన్ సాకుతో గింజలను కొనుగోలు చేయకపోవడంతో కౌలురైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకోకు ధర ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికీ నష్టపోయిన రైతులకు ఇక ఆత్మహత్యలే శరణ్యమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే రైతులు మరింత నష్టపోతారన్నారు. గత నెలలో కిలో గింజలు రూ. 650 ఉంటే ప్రస్తుతం రూ. 500లకు తగ్గించి రైతులను ఇబ్బందులకు గురిచేశారని, అన్ సీజన్ పేరుతో రూ. 200 నుంచి రూ. 240లకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారన్నారు. కోకో గింజలతో పచ్చళ్లు పెట్టుకోండి అంటూ రైతులను హేళన చేస్తున్నారన్నారు. కోకో గింజలకు రూ. 900 మద్దతు ధర కల్పించకపోతే రైతులు నష్టపోతారన్నారు. ప్రభుత్వం రంగంలోకి దిగి రైతుల నుంచి కోకో గింజలను కొనుగోలు చేయాలని, ధరల స్థిరీకరణ నిధి పథకాన్ని అమలు చేయాలన్నారు. విదేశీ కోకో గింజల దిగుమతిని నిలుపుదల చేయాలన్నారు. ఉద్యానశాఖ నుంచి రావాల్సిన సబ్సిడీ బకాయిలను వెంటనే అందించాలన్నారు. కార్యక్రమంలో రైతులు ఉప్పల కాశీ, నాయుడు లక్ష్మణరావు, ఉండవల్లి కృష్ణారావు, గారపాటి వెంకట సుబ్బారావు, కంకటాల బుద్దుడు, సుభాష్ చంద్రబోస్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. సుందర బాబు, ఆలపాటి శ్రీధర్, సంగీత నాగరాజు, ఆకుల మోహనరావు, బిక్కిన కృష్ణ, జీ. శ్రీమన్నారాయణ, ఎంవీవీ సత్యనారాయణ, కొవ్వూరు, చాగల్లు, నిడదవోలు, దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

● శ్రమదానంలో నన్నయ వీసీ ప్రసన్నశ్రీ



శ్రమదానం చేస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన శ్రమదానం కార్యక్రమంలో వీసీ పాల్గొని విద్యార్థులతో కలిసి ఇటుకలు మోశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరూ మన ప్రాంగణం అనే భావనతో ముందుకు సాగాలన్నారు. వర్సిటీ విద్య కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో నన్నయ ప్రాంగణంలోని బ్యాంకు పక్కన వాహనాల పార్కింగ్‌కు ఆ ప్రాంతాన్ని శుభ్రపరిచే కార్యక్రమం విద్యార్థులు చేపట్టారు. వీసీ విద్యార్థులతో కలిసి కొద్దిసేపు సిమ్మెంట్ ఇటుకలు మోశారు. వీసీ స్వయంగా శ్రమదానం చేస్తుండడంతో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, యూనియన్ బ్యాంకు మేనేజర్ కూడా శ్రమదానంలో పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో ప్రొవిజనల్ మెరిట్‌లిస్ట్

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): 2024 జనవరి 21వ తేదీన కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న పారామెడికల్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఆ నోటిఫికేషన్‌కు సంబంధించిన రివైజ్డ్ ప్రొవిజనల్ మెరిట్‌లిస్ట్‌ను వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు చెందిన అభ్యర్థులు తమ జిల్లాలకు సంబంధించిన ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో తమపేర్లను పరిశీలించుకోవాలని కోరారు. అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈనెల 27, 28 తేదీల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో లిఖిత పూర్వకంగా తమ అభ్యంతరాలు సమర్పించాలన్నారు. ఈనెల 28 వ తేదీ సాయంత్రం 4 గంటల తరువాత వచ్చిన ఎటువంటి అభ్యంతరాలకు సంబంధించిన దరఖాస్తులను పరిగణించబోమని స్పష్టం చేశారు.

కొమ్మ..కొమ్మకు.. గుత్తులు..గుత్తులు

● చెట్టు మొదళ్లనే విరగకాసిన మామిడికాయలు

సామర్లకోట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మామిడికాయలు అంటే చిటారు కొమ్మలకు కాస్తాయి అనేది అందరికీ తెలిసిందే. సామర్లకోట ఏడీబీ రోడ్డులో ఒక పొలంలో మామిడిచెట్టు లావుగా ఉన్న మొదలు కొమ్మలకు ఎటువంటి ఆకులు లేకుండా గుత్తులు గుత్తులుగా మామిడికాయలు కాసి ఆ దారిన పోతున్న పలువురిని ఆకర్షిస్తున్నాయి. బంగినపల్లి రకానికి చెందిన ఈ మామిడికాయలు ఏడాది విడిచి ఏడాది ఈ రీతిలో చెట్టు మొదలు కొమ్మలకు గుత్తులు గుత్తులుగా కాయలు కాస్తాయని రైతు వెంకన్నకాపు చెప్పారు.





సామర్లకోటలో మామిడి చెట్టు మొదళ్లకే కాసిన మామిడికాయలు



అమ్మా నేను మోసపోయా..

● ఫార్మ్‌డీ ఫైనలియర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం
● రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేనిలో ఘటన
● ఆసుపత్రి కోఆర్డినేటర్ దీపక్ వేధింపులే కారణమని ఆరోపణ



విద్యార్థి అంజలి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అమ్మా నా గురించి బెంగపెట్టుకో వద్దు.. నేను దారుణం గా మోసపోయా..ఒక ఫంక్షన్‌కి రెడ్ కలర్ శారీ కట్టుకుని వెళ్లి వాడికళ్లలో పడ్డా..ఆ ఫంక్షన్‌కి రెడ్ కలర్ శారీ కట్టుకుని వెళ్లకుండా ఉండాల్సింది. అలా చేసి ఉంటే ఈ రోజు సంతోషంగా ఉండేదానిని.. వాడు తనను మోసం చేశాడని.. తనకు మరణం తప్పవేరే దారి కనిపించడం లేదు.. నా కోసం ఆలోచించవద్దు..చెల్లికి మంచి వ్యక్తిని చూసి పెళ్లి చేయండి.. తాను మరణించాక తన అవయవాలను దానం చేయాలని.. తన చెల్లికి తాను మళ్లీ పాపగా పుడతానని ఒక వైద్య విద్యార్థిని డైరీలో రాసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేని ఆసుపత్రిలో ఇంటర్న్‌షిప్ చేస్తున్న వికాస్ ఫార్మసీ కళాశాల ఫార్మ్‌డి ఫైనలియర్ విద్యార్థిని నల్లపు అంజలి (23) ఆత్మహత్యాయత్నం తీవ్రసంచలనం కలిగించింది. తోటి విద్యార్థినులను కదిలిచింది. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మం డలం రౌతుగూడెం గ్రామానికి చెందిన అంజలి రాజమహేంద్రవరం సమీపంలోని మధురపూడి వద్ద వికాస్ ఫార్మసీ కళాశాలలో ఫార్మ్ డి ఫైనలియర్ చదువుతుంది. గత ఆరునెలలుగా రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేని ఆసుపత్రిలో ఇంటర్న్‌షిప్ చేస్తుంది. ఇదిలా ఉండగా ఈ నెల 23న ఆసుపత్రిలో అంజలి ఎనస్థీషియా అత్యధిక డోస్ ఇంజక్షన్ చేసుకుని కొద్దిసేపటికే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. ఆమెతో కలిసి పనిచేసే సహచర సిబ్బంది గమనించి వెంటనే ఐసీయూలోకి తరలించి వైద్యం అందించారు. అయితే పరిస్థితి విషమించినా విషయం బయటకు రాకుండా ఆసుపత్రి వర్గాలు జాగ్రత్తపడ్డాయి. అయితే ఆమె డైరీలో రాసుకున్న సూసైడ్ లెటర్ బయటకు రావడంతో అంజలి తల్లిదండ్రులు, బంధువుల, కళాశాల విద్యార్థినులు, విద్యార్థి సంఘాలు మంగళవారం రాజమహేంద్రవరంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాయి. బొల్లినేని ఆసుపత్రిని ముట్టడించి ధర్నా చేశాయి. అంజలి ఆత్మహత్యాయత్నానికి కారణమైన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో మెడికల్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తు న్న దీపక్ ఆమెను వేధించి అవసరాలు తీర్చుకుని ఇదే విషయాన్ని మరికొంత మందికి చెప్పి వేధింపులకు గురిచేయ డంతో తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆమె రాసిన లేఖలో కూడా తాను అనుభవించిన దారుణ సంఘటనలు వివరించింది. సంఘటన స్థలాన్ని ఏఎస్పీ సుబ్బరాజు, డీఎస్పీలు రమేష్ బాబు, భవ్యకిషోర్ పర్యవేక్షించారు. అంజలి తండ్రి నల్లపు దుర్గారావు ఫిర్యాదు మేరకు ప్రకాష్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆడబిడ్డకు అన్యాయం జరిగితే సహించం

● ఎమ్మెల్యేలు బత్తుల, ఆదిరెడ్డి

విషయం తెలుసుకున్న రాజానగరం, రాజమహేంద్రవరం ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, ఆదిరెడ్డి వాసు ఆసుపత్రికి చేరుకుని అంజలి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను ఆరాతీశారు.ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు చెప్పడంతో మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం అంజలి తల్లి,చెల్లిని పరామర్శించారు.ఈ ఘటనకు కారణమైన వారిని చట్ట ప్రకారం శిక్షిస్తామని.. ఆడబిడ్డకు అన్యాయం జరిగితే సహించేదిలేదన్నారు.అంజలి కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తొలుత ఆందోళన చేస్తున్న విద్యార్థినులకు మాజీ ఎంపీ భరత్‌రామ్ మద్దతుగా నిలిచారు.



కిమ్స్ బొల్లినేని ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

జీ.మేడపాడు ఎత్తిపోతల పథకం అక్రమాలపై విచారణ

● రైతుల నుంచి వాంగ్మూలాలు సేకరణ



సామర్లకోటలో విచారణ నిర్వహిస్తున్న అధికారులు

సామర్లకోట, మార్చి25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం జీ.మేడపాడు ఎత్తిపోతల పథకంలో పలు అక్రమాలు చోటుచేసుకుని రైతులనుంచి సేకరించిన సొమ్ములు స్వాహాకు గురవుతున్నాయని, సంస్థ అధ్యక్షుడు ఎత్తిపోతల పథకాన్ని తన సొంత ఆస్తిలా వాడుకుంటున్నాడని ఆయకట్టు రైతులు జిల్లా అధికారులకు చేసిన ఫిర్యాదుతో మంగళవారం సామర్లకోట తహశీల్దార్ కార్యా లయంలో సమగ్రవిచారణ నిర్వహించారు. తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, కోపరేటివ్ రిజిస్ట్రార్ శివకామేశ్వరరావు ఈ విచారణలో పాల్గొన్నారు. ఫిర్యాదుదారుల తరపున తెలుగురైతు కాకినాడ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ పాలకుర్తి శ్రీనుబాబు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు పాలకుర్తి వీరభవన్నారాయణ, ఎత్తిపోతల పథకం డైరెక్టర్లు పాలకుర్తి చినబాబు, మద్దిపాటి ప్రకాష్, గోలి తమ్మిరాజు, పుట్టా రాంబాబు, తదితర రైతులు పాల్గొని తహశీల్దార్ చంద్రశేఖరరెడ్డి ముందు తాము ఎదుర్కొంటున్న సమస్యలు అక్రమాలపై ఎలుగెత్తారు. ఎత్తిపోతల పథకం ఆయకట్టుకు కాకుండా అనధికార ఆయకట్టుకు రెండు పంటలకూ సాగునీరు సమృద్ధిగా అందిస్తూ ఏటా లక్షలాది రూపాయలు అక్రమ వసూళ్లు చేస్తున్నారన్నారు. వాస్తవ ఆయకట్టులో ఇద్దరి రైతులకు చెందిన సుమారు 90 ఎకరాలు ఆయకట్టు ఉండగా వాటికి అసలు నీరివ్వకుండా అక్రమంగా మరో 100 ఎకరాలకు సాగునీరందిస్తున్నట్లు రికార్డులలో టాంపరింగ్ చర్యలకు పాల్పడుతున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రెజర్‌వాల్వ్ ఓపెన్‌చేస్తూ నీటిని అక్రమంగా మళ్లిస్తూ వ్యాపారం చేస్తున్నాడని ఆరోపించారు. నీటి యాజమాన్యం, నిధుల స్వాహా, ఆయకట్టు కమిటీ ఎన్నికలు నిర్వహించకపోవడం వంటి అంశాలతో సొంత ప్రైవేట్ కంపెనీగా అక్రమంగా వాడుకుంటూ ఏటా లక్షలాది రూపాయలు స్వాహా చేస్తున్నాడని పలువురు ఫిర్యాదుదారులు తహశీల్దార్, కోపరేటివ్ రిజిస్ట్రార్ ఎదుట వివరించారు. ఎత్తిపోతల పథకం నిర్వహణలో ఐడీసీ అధికారులు, కోపరేటివ్ అధికారులు కీలకపాత్ర పోషించాల్సి ఉన్నప్పటికీ ఆ రెండు శాఖల అధికారులు మౌనం దాల్చడంతో కమిటీ అధ్యక్షుడు అక్రమాలకు పాల్పడేందుకు దోహదపడిందని శ్రీనుబాబు అధికారుల ఎదుట ఆరోపించారు. ఈ విచారణలో ఎత్తిపోతల పథక ఆయకట్టుదారుల సంఘ అధ్యక్షుడు ఆచంట రాజబాబు పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారి అధ్యయనోత్సవాలు

● గరుడవాహనంపై విహరించిన శ్రీవారు

ఆత్రేయపురం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి అధ్యయనోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజామునే గోదావరి నదీజల సంగ్రహణ కార్యక్రమం మేళతాళ మంగళవాయిద్యాల నడుమ నిర్వహించారు. స్నపనమూర్తులకు అభిషేకం నిర్వహించారు. అనంతరం ద్రవిడ వేద పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనాలు అందించారు. అధ్యయనోత్సవాలలో భాగంగా పల్లకి మహోత్సవం, శ్రీవారు గరుడవాహనంపై ఆసీనులై వీధుల్లో విహరించారు. మేళతాళ మంగళ వాయిద్యాలు వేదమంత్రాలు, కేరళవాయిద్యాలతో అధ్యయనోత్సవాలు శోభయమానంగా నిర్వహించారు.స్వామివారి కల్యాణోత్సవాలకు ముందుగా ఈఉత్సవాలను నిర్వహిస్తారు. ఐదు రోజులపాటు అధ్యయనోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఆలయ ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లు చేశారు.



శ్రీ వేంకటేశ్వరస్వామి అధ్యయనోత్సవాలలో భాగంగా గరుడవాహన గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



వాడపల్లి అధ్యయనోత్సవాలలో భాగంగా ద్రవిడ వేదపారాయణం నిర్వహిస్తున్న వేదపండితులు

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆదాయం

రూ.26,48,813



ఆలయంలో హుండీలను లెక్కిస్తున్న అధికారులు, భక్తులు, సిబ్బంది

అంతర్వేది, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో మంగళవారం తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో హుండీలను లెక్కించినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. ప్రధాన ఆలయ హుండీ ద్వారా రూ.25,86,985, గుర్రాలక్కమ్మ హుండీ రూ.20, 676, అన్నదాన హుండీ రూ.41,152 మొత్తం హుండీల ద్వారా 39 రోజులకుగాను రూ.26,48,813 ఆదాయం వచ్చినట్టు ఏసీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భైరా నాగరాజు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఒడుగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధిలో భక్తులకు ఏసీ గదుల నిలుపుదల

ఉన్నతాధికారులు వివరణ కోరడంతో పునరుద్ధరణ

అన్నవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో నీటి కొరత కారణంగా ఈవో సుబ్బారావు ఆదేశాలతో భక్తులకు ఏసీ గదులను సోమవారం రాత్రి నుంచి సీఆర్వో కార్యాలయంలో కేటాయింపును నిలుపుదల చేశారు. మంగళవారం ఉదయం దీనిపై ఉన్నతాధికారులు వివరణ కోరడంతో గదుల కేటాయింపు పునరుద్ధరించారు. పంపా రిజర్వాయర్‌లో అడుగింటిపోయిన భూగర్భనిల్వలు నేపథ్యంలో సత్యగిరి కొండపైకి నీటి సరఫరా సరిగా జరగడం లేదు. సత్యగిరి కొండపై శివసదన్ కాటేజీలో 138, హరిహరసదన్ కాటేజీలో సుమారు 80 గదులు ఉన్నాయి. రత్నగిరి కొండపై ప్రకాష్‌సదన్ కాటేజీలో 84 ఏసీ గదులుండగా వేసవి నేపథ్యంలో భక్తులు ఏసీ గదులు తీసుకునేందుకు ఆసక్తి కనబరుస్తారు. ఒక్కసారిగా ఏసీ గదుల కేటాయింపు నిలుపుదల నేపథ్యంలో భక్తుల నుంచి విమర్శలు రావడం, వివిధ ప్రసార మాధ్యమాల్లో దావానంలా వ్యాపించడంతో కాకినాడ జిల్లా కలెక్టర్, దేవదాయశాఖ కమిషనర్ వివరణ కోరడంతో గదుల కేటాయింపు పునరుద్ధరించారు.

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్‌ఐ, డ్రైవర్‌కు 14రోజుల రిమాండ్

పిఠాపురం రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన కాకినాడ జిల్లా పిఠాపురం రూరల్ ఎస్‌ఐ ఎల్.గుణశేఖర్, ప్రవేటు డ్రైవర్ నల్లా శివలకు 14రోజులు పాటు రిమాండ్ విధిస్తూ రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. పిఠాపురం మండలం పి.దొంతమూరు గ్రామానికి చెందిన కిల్లాడి దుర్గాప్రసాద్, సానబోయిన గంగరాజులను 2024 అక్టోబరులో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసు నుంచి తప్పించేందుకు ఎస్‌ఐ రూ.20వేలు లంచం డిమాండ్ చేశారు. ఈ లంచం తీసుకుంటుండగా రూరల్ ఎస్‌ఐ గుణశేఖర్‌తో పాటు అతను వినియోగించే పోలీసు జీపు ప్రవేటు డ్రైవర్‌గా పనిచేస్తున్న నల్లా శివను ఏసీబీ డీఎస్పీ కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి దాడి చేసి పట్టుకున్న సంగతి తెలిసిందే. వారిని రాజమహేంద్రవరం ఏసీబీ కార్యాలయంలో మంగళవారం విచారించారు. రాత్రి ఏసీబీ కోర్టులో హాజరుపరచగా ఏప్రిల్ 18వ తేదీ వరకూ జడ్జి రిమాండ్ విధించారు. అరెస్టు అనంతరం ఎస్‌ఐ వద్ద ఉన్న మొబైల్స్‌తో పాటు ప్రవేటు డ్రైవర్ వద్ద ఫోన్లను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌లో కేసులకు సంబంధించిన కొన్ని రికార్డులు తమతో తీసుకెళ్లినట్టు సమాచారం.

లావాదేవీలపై ఆరా...

పిఠాపురం రూరల్ ఎస్‌ఐ, ప్రవేటు డ్రైవర్ల సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు అందులో ఫోన్‌కా ల్స్, వాట్సాప్ మెసేజీలు, ఫోన్‌పే, జీ పే లావాదేవీలపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఎస్ ఐ నుంచి ఫోన్‌పే ద్వారా ఒక పోలీసు ఉన్నతాధికారి వద్ద పనిచేస్తూ ఎస్సీఎస్టీ కేసులు చూసే సిబ్బంది ఒకరికి పంపిన నగదు విషయాన్ని గుర్తించి దానిపై ఆరా తీస్తున్నట్టు పోలీసు వర్గా లు తెలిపాయి. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని ఏసీబీ అధికారులు విచారణ జరుపుతున్నట్టు చెబుతున్నారు. ఎస్‌ఐ ఏసీబీకి చిక్కడంతో కాకినాడ సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులందరూ అలర్టయ్యారు. ప్రవేటు వ్యక్తులను పోలీసుస్టేషన్లకు రావద్దని చెప్పడం గమనార్హం.

కంటైనర్‌లో మందు సీసాల పట్టివేత

కంటైనర్ సీజ్, డ్రైవర్ అరెస్ట్

ముమ్మిడివరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బుకింగ్ సరుకు రవాణా చేస్తున్న కంటైనర్‌లో యానాం నాన్‌డ్యూటీపెయిడ్ మందు సీసాలను రవాణా చేస్తుండగా ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డారు. హైదరాబాద్‌కు చెందిన అమెజాన్ సంస్థకు చెందిన ఆన్‌లైన్‌లో బుక్ చేసిన సరుకును కంటైనర్‌లో తీసుకువెళ్తూ కాకినాడలో కొంత సరుకును దింపి అమలాపురం తరలించే క్రమంలో ఆ కంటైనర్ డ్రైవర్ నల్గొండకు చెందిన కొండ్రు వేణు యానాంలో ఆరు బీరు బాటి టీన్నులు, రెండు లీటర్ల విస్కీ బాటిళ్లను కొనుగోలు చేసి వస్తున్నాడు. ఎదుర్లంక చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో ఎక్సైజ్ సిబ్బందికి పట్టుబడ్డాడు. కంటైనర్‌ను, డ్రైవర్‌ను కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు ముమ్మిడివరం ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌కు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో కానిస్టేబుల్ వారిస్తున్నా వినకుండా కంటైనర్ డ్రైవర్ వేణు అమలాపురం వైపు పోనిచ్చాడు. దారిలో 2 లీటర్ల విస్కీ బాటిళ్లను ధ్వంసం చేశాడు. దీంతో ఎక్సైజ్ సిబ్బంది చేజ్ చేసి కంటైనర్‌ను, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ముమ్మిడివరం పోలీసుస్టేషన్‌కు తరలించారు. కంటైనర్‌ను సీజ్ చేసి కంటైనర్ డ్రైవర్ వేణుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అదనపు కట్నం కోసం వేధింపులు భర్తతో సహా పలువురిపై కేసు

గొల్లప్రోలు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మహిళను అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తతో సహా పలువురిపై గొల్లప్రోలు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలోని ఈబీసీ కాలనీకి చెందిన కోలా సునీతకు నాలుగు సంవత్సరాల క్రితం పిఠాపురం మండలం నవఖండ్రవాడకు చెందిన ఆనంద ప్రసాద్‌తో వివాహమైంది. వారికి ఒక పాప ఉంది. పెళ్లి సమయంలో రూ.4.50లక్షల నగదు, బంగారం కట్నంగా ఇచ్చినా కొంతకాలంగా అదనపు కట్నం కోసం భర్త ఆనందప్రసాద్ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్టు సునీత పోలీసులకు ఫిర్యాదు చేసింది. అతడికి తల్లి, ఆడపడుచు, ఆమె భర్త, అతడి మేనమామ, భార్యలు ఆనందప్రసాద్‌కు మద్దతు ఇచ్చి వేధింపులకు గురిచేస్తున్నట్టు ఆమె ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై వరకట్నం వేధింపులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

జాబ్‌మేళాలో 131మంది ఎంపిక

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో వికాస ఆధ్వర్యంలో 2రోజులపాటు జరిగిన జాబ్‌మేళాలో 131 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గూగుల్ అనుబంధ సంస్థ వర్చుసా కన్సల్టింగ్ సర్వీస్ కంపెనీలో వారు కంటెంట్ ఎనాలిస్టులుగా పనిచేస్తారు. మొత్తం 1440 అభ్యర్థులు ఈ జాబ్‌మేళాలో పాల్గొన్నారు. మొత్తం 350 మంది అభ్యర్థులను ఎంపిక చేయాలని వర్చుసా ప్రతినిధులు ప్రకటించినప్పటికీ ఇంగ్లీషు భాషపై పట్టులేకపోవడం వల్ల కేవలం 131 మంది మాత్రమే ఉద్యోగాలు పొందారు. అయితే ఇంటర్వ్యూలో ఫెయిల్ అయ్యిన అభ్యర్థులు ఇంగ్లీషులో ప్రత్యేక శిక్షణ తీసుకుని వచ్చే నెల మరోసారి జరిగే జాబ్‌మేళాకు హాజరుకావాలని నిర్వాహకులు తెలిపారు. అనంతరం విజేతలు జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాను మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి ఆయన అభినందనలు తెలిపారు.

ఏజెన్సీలో ముమ్మరంగా వాహనాల తనిఖీ

మోతుగూడెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతివాడ జిల్లాలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. ఈ నేపథ్యంలో చింతూరు మండలంలో మోతుగూడెం ఎస్‌ఐ శివనారాయణ, సిబ్బంది, సీఆర్పీఎఫ్ ఏ పార్టీ టు బెటాలియన్, సీఆర్పీఎఫ్ సిబ్బంది ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. బస్సుల్లో ప్రయాణికుల బ్యాగులు సోదాలు చేశారు. ఇతర ప్రైవేట్ వాహనాలు, ద్విచక్రవాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో ట్రైనింగ్ ఎస్‌ఐలు సీతారాం, చంటి తదితరులు పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ శివ నారాయణ, పోలీస్ సిబ్బంది, సీఆర్పీఎఫ్‌ఏ 42 బెటాలియన్ ట్రైనింగ్ ఎస్‌ఐలు

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ ప్రవీణ్ మృతి

బుల్లెట్‌పై వెళ్తుండగా గామన్ వంతెన వద్ద ఘటన



పాస్టర్ ప్రవీణ్‌కుమార్ (ఫైల్)



ఘటనా స్థలం వద్ద ప్రవీణ్‌కుమార్ మృతదేహం

రాజానగరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గామన్ బ్రిడ్జి రహదారిపై కొంతమూరు నయారా పెట్రోల్ బంకు వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ పాస్టర్ మృతి చెందారు. ఇందుకు సంబంధించిన వివరాలను రాజానగరం సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ మంగళవారం విలేకర్లకు తెలిపారు. హైదరాబాద్ తిరుమలగిరి సమీపంలోని ఎస్‌బీఏహెచ్ కాలనీకి చెందిన పగడాల ప్రవీణ్‌కుమార్(46) అంతర్జాతీయ క్రైస్తవ ప్రసంగీకుడిగా కొనసాగుతున్నారు. హైదరాబాద్ నుంచి బుల్లెట్‌పై వెనుక లగేజీ బ్యాగ్ కట్టుకుని సోమవారం రాత్రి రాజమహేంద్రవరం బయలుదేరారు. రాజమహేంద్రవరంలో స్నేహితుడి ఇంటికి వెళ్తున్నానని, భార్యకు చెప్పి బుల్లెట్‌పై బయలుదేరినట్టు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో మార్గమధ్యలో సోమవారం అర్ధరాత్రి కొంతమూరు సమీపంలోని నయారా పెట్రోల్ బంకు వద్దకు వచ్చే సరికి మోటార్‌సైకిల్ అదుపుతప్పి రహదారి నుంచి పల్లపు ప్రాంతానికి పడిపోవడంతో మోటార్ సైకిల్ ప్రవీణ్‌కుమార్‌పై పడి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మర్నాడు ఉదయం వరకు ఎవరూ గమనించలేదు. మంగళవారం ఉదయం తమకు వచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించామని, బుల్లెట్‌తో సహా ప్రవీణ్‌కుమార్ రహదారి పైనుంచి కిందికి జారిపోవడం, బుల్లెట్ ఆయనపై పడిపోవడంతో మృతిచెందినట్టు తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. ఎస్‌ఐ మనోహర్ కేసు నమోదు చేశారు.

పాస్టర్ మృతిపై క్రైస్తవ సంఘాల నాయకుల ఆగ్రహం

రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధన ఆసుపత్రి ఎదుట నిరసన, ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ క్రైస్తవ సువార్తికుడు పాస్టర్ ప్రవీణ్ పగడాల మంగళవారం తెల్లవారుజామున కొంతమూరు-ఆటోనగర్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటనపై తూర్పుగోదావరి జిల్లాకు చెందిన క్రైస్తవ సంఘాల నాయకులు, పలువురు మతపెద్దలు, రాజకీయ నాయకులు భగ్గుమన్నారు. ఇది రోడ్డు ప్రమాదం కాదని, పాస్టర్ ప్రవీణ్‌ను ఆయన వ్యతిరేకులు ఎవరో చంపేశారని అనుమానం వ్యక్తం చేస్తూ మంగళవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి తమకు న్యాయం చేయాలని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ప్రభుత్వాసుపత్రి ఎదురుగా ఉన్న ప్రాంతం ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. రెండు, మూడు గంటలపాటు రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడి ధర్నాను తాత్కాలికంగా విరమింప చేశారు. ఈ ఆందోళనలో మాజీ ఎంపీ హర్షకుమార్, రాజేష్ మహాసేనతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలు, రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ పాస్టర్లు జాన్ వెస్లీ, జేమ్స్, విజయరాజు వంటి వారితోపాటు క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు క్రైస్తవసంఘ నాయకులు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందలేదనే అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు ఈ విషయంలో నిష్పాక్షికమైన దర్యాప్తు చేయాలని కోరారు. కాగా అంతకుముందు ప్రభుత్వ బోధనాసుపత్రి మార్చురీలో ఉంచిన ప్రవీణ్ మృతదేహాన్ని పలువురు సందర్శించారు.



రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద మాజీ ఎంపీ హర్షకుమార్, పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు

ప్రవీణ్ మృతిపై ఐదు ప్రత్యేక విచారణ బృందాలు : ఎస్పీ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మరణించిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి ఘటనపై కొందరు అనుమానాస్పదంగా ఉందని ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో ఈ సంఘటనపై విచారణకు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక పోలీస్ బృందాలు పారదర్శకంగా, ఎటువంటి డివియేషన్స్ లేకుండా కేసును సరైన పద్ధతిలో విచారణ చేస్తున్నాయన్నారు. ఇతరుల మనోభవాలు, మానాభిమానాలు దెబ్బతినేలా, కుల,మత రాజకీయవర్గాల మధ్య విద్వేషాలు రగిల్చేలా, మతపరమైన, సున్నిత అంశాల్లో వదంతులు, అవాస్తవాలు ప్రచారం చేస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగించేలా సామాజిక మధ్యమాల్లో తప్పుడు ప్రచారాలను వ్యాప్తి చేసి ప్రజలను రెచ్చకొడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు ఉన్నాయని, గుర్తిస్తే వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

ముళ్ల కంచెలో ముక్కుపచ్చలారని పసిబిడ్డ

- పోతవరంలో అమానుషం
- కుక్కలు పీక్కు తింటుండగా అడ్డుకున్న రైతులు
- ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స, పరిస్థితి విషమం



కుక్కలు తినేసిన శిశువు తలభాగం



పోతవరం పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నల్లజర్ల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పోతవరంలో మంగళవారం అమానుష ఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పోతవరం- యర్నగూడెం రోడ్డులో పొగాకు బ్యారన్స్ దగ్గర ఉన్న ముళ్లపొదల్లో ముక్కుపచ్చలారని ఆడశిశువును గుర్తు తెలియని వ్యక్తులు పడేసి వెళ్లిపోయారు. ఉదయం పాలు తీసుకురావడానికి అటుగా వెళ్తున్న రైతులు శిశువును కుక్కలు పీక్కుతినడం చూసి వాటి నుంచి శిశువును కాపాడి వైద్య సిబ్బందికి సమాచారం అందించారు. ఏఎన్ఎం మహాలక్ష్మి,గ్రామ సంరక్షణ అధికారి దీపక సంఘటనా స్థలానికి వెళ్లి రక్తపు మడుగులో ఉన్న శిశువును తీసుకుని వచ్చి ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం డాక్టర్ రాజశేఖర్ శిశువును పరిశీలించి మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శిశువుకు డీఎస్ ఏ పరీక్షలు నిర్వహించి రక్తం ఎక్కించారు. నల్లజర్ల సీఐ వై.రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలానికి వెళ్లిన సీఐ సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. సీడీపీవో నాగలక్ష్మి, ఏసీడీపీవో పద్మావతి, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి ఏలూరు వెళ్లి శిశువును పరిశీలించి సంరక్షణ కోసం ఇద్దరి ఆయాలను అక్కడ ఉంచారు. మరో 48 గంటలు దాటితే తప్ప ఆరోగ్య పరిస్థితి చెప్పలేమని వైద్యులు తెలిపినట్టు సీడీపీవో నాగలక్ష్మి తెలిపారు. ముక్కుపచ్చలారని పసిబిడ్డను ముళ్ల కంచెలో విసిరి వేయడానికి మనసు ఎలా వచ్చిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పోతవరంలో ఇతర ప్రాంతాల నుంచి పొగాకు పనులు చేసుకునేవారు వందల సంఖ్యలో ఉంటారని, వారే గుట్టుచప్పుడు కాకుండా శిశువును విసిరివేసి ఉంటారని గ్రామస్థులు భావిస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



రాంబాబు(ఫైల్)

జగ్గంపేట రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం గ్రామ శివారున జరిగిన రోడ్డు ప్రమాదంలో సిగిరెడ్డి రాంబాబు(59) మృతిచెందాడు. వివరాల ప్రకారం.. జగ్గంపేటకు చెందిన సిగిరెడ్డి రాంబాబు రామవరం హైవేలో ఉన్న లారీ యూనియన్ ఆఫీసుకి బైక్‌పై వెళ్తుండగా రాజమండ్రి నుంచి విశాఖ వైపు వెళుతున్న కారు బైక్‌ను బలంగా ఢీకొంది. దీంతో బైక్‌పై వెళ్తున్న రాంబాబు రోడ్డుపై పడి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే చనిపోయాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురానికి తరలించినట్టు ఎస్‌ఐ రఘునాధరావు తెలిపారు.

బస్సు, బైక్ ఢీ

ఇద్దరికి గాయాలు



ప్రమాద స్థలం వద్ద క్షతగాత్రులు

పెద్దాపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు పాఠశాల బస్సు, మోటార్ సైకిల్ ఢీకొనగా ఇద్దరు గాయపడిన సంఘటన కాకినాడ జిల్లా పెద్దాపురం మండల పరిధిలోని కాండ్రకోట గ్రామంలో మంగళవారం జరిగింది. సామర్లకోట కేఎస్ఎన్ పాఠశాలకు చెందిన బస్సు కాండ్రకోట మర్లావ రహదారి మధ్యలో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను బలంగా ఢీకొంది. దీంతో జగ్గంపేట మండలం కాట్రావులపల్లికి చెందిన కంచుమర్తి వెంకటేష్, చీట్నీడి అమ్మన్న గాయాలపాలయ్యారు. చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ వి.మౌనిక తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం

- తాత వరసైన వ్యక్తి ఇంట్లోకి తీసుకెళ్లి అఘాయిత్యం
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

ఎటపాక, మార్చి 25(ఆంధ్రజ్యోతి): అభం, శుభం తెలియని నాలుగేళ్ల చిన్నారి ఆడుకుంటుండగా తాత వరసైన వ్యక్తి ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేసిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన అల్లూరి జిల్లా ఎటపాక మండలం గౌరిదేవిపేట పంచాయతీ పరిధిలో జరిగింది. ఈనెల17న ఉదయం ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న చిన్నారిని ఎదురింట్లో ఉండే తాత వరసైన వ్యక్తి మడకం చిట్టిబాబు (42) చేయి పట్టుకుని తన ఇంట్లోకి తీసుకెళ్లాడు. చిన్నారిపై అఘాయిత్యం చేసి బయటకు తీసుకువచ్చాడు. ఆరోజు రాత్రి చిన్నారి నొప్పిగా ఉందని, జరిగిన విషయం తల్లికి చెప్పింది. దీంతో చిన్నారి తల్లిదండ్రులు న్యాయం చేయాలంటూ కులపెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. కులపెద్దల సమక్షంలో న్యాయం జరగకపోవడంతో మంగళవారం బాధిత తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా మంగళవారం బాధిత కుటుంబ సభ్యులతో పాటు ఇరుగు,పొరుగువారిని విచారించారు. అత్యాచారం జరిపిన ఇంటి ప్రాంతాన్ని పరిశీలించారు. వైద్యపరీక్షల నిమిత్తం చిన్నారిని చింతూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

మహిళ స్నానం చేస్తుండగా వీడియోలు తీసి కోరిక తీర్చాలంటూ వేధింపులు

ఇద్దరిని అరెస్ట్ చేసిన అనపర్తి పోలీసులు

అనపర్తి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మహిళ స్నానం చేస్తుండగా చాటుగా వీడియోలు చిత్రీకరించి ఆమెను బ్లాక్ మెయిల్ చేస్తూ కోరిక తీర్చాలంటూ వేధించడమే కాకుండా డబ్బులు డిమాండ్ చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు అనపర్తి ఎస్‌ఐ శ్రీనునాయక్ తెలిపారు. వివరాల ప్రకారం..తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం పీరా రామచంద్రపురానికి చెందిన నల్లమిల్లి మణికంఠరెడ్డి(అయ్యప్ప), కర్రి రామకృష్ణారెడ్డి అదే గ్రామానికి చెందిన మహిళ స్నానం చేస్తుండగా వీడియో చిత్రీకరించారు. సంఘటన జరిగి సుమారు నాలుగు నెలలు గడిచింది. నాటి నుంచి మహిళకు ఆ వీడియోలు చూపి రూ.లక్ష ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. అయితే తాను డబ్బులు ఇవ్వలేనని బయటకు తెలిస్తే పరువుపోతుందని బ్రతిమాలుతూ వస్తుంది. చివరకు రూ.4వేలు ఇచ్చిన ఆమె ఇక డబ్బులు ఇవ్వలేనని, వీడియోలు డిలీట్ చేయాలని ప్రాధేయపడింది. తమ కోరిక తీరిస్తే వీడియోలు డిలీట్ చేస్తామని లేకుంటే సోషల్ మీడియాలో పెడతామని వారిద్దరు బెదిరించారు. చివరకు ఆమె వారి వేధింపులు తాళలేక విషయాన్ని భర్తకు చెప్పి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే ఎస్‌ఐ ఆధ్వర్యంలో పోలీసులు ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ నిర్వహిస్తున్నామని ఎస్‌ఐ శ్రీనునాయక్ తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

అదుపు తప్పి పొలాల్లోకి దూసుకుపోయిన స్కూల్ బస్సు

40 మంది పిల్లలు సురక్షితం



కె.కొత్తూరు శివారున పంట పొలాల్లోకి దూసుకుపోయిన బస్సు

జగ్గంపేట రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేటలోని ప్రైవేట్ విద్యాసంస్థలకు సంబంధించిన స్కూల్ బస్సు జగ్గంపేట మండలం కె. కొత్తూరు గ్రామ శివారున అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకుపోయింది. స్కూలు ముగిసిన తరువాత పిల్లలను ఇంటికి తీసుకుని వెళ్తుండగా మార్గమధ్యలో ఈ ఘటన జరిగింది. ఆ సమయంలో బస్సులో 40 మంది పిల్లలు ఉన్నారు. పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని పొలాల్లోకి వెళ్లి ఆగింది. విద్యుత్ వైర్లు పక్కకు ఒరిగి అలా ఉండిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పిల్లలను బస్సులోంచి దించి వెంటనే వేరే బస్సులో వారి గమ్య స్థానాలకు చేర్చారు. గడ్డి బండి అకస్మాత్తుగా రావడంతో బస్సు అదుపు తప్పినట్టు డ్రైవర్ తెలిపాడు.

చెరువులో పడి వ్యక్తి మృతి

రెండురోజుల తర్వాత మృతదేహం లభ్యం



చెరువులో వీర పురుషోత్తం మృతదేహం

గొల్లప్రోలు రూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని చెరువులో పడి వ్యక్తి మరణించగా మంగళవారం మృతదేహం లభ్యమైంది. గ్రామానికి చెందిన సలాది వీర పురుషోత్తం (37) తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఈనెల 23వ తేదీన బహిర్భూమికి గానూ పెద(కోటలంక వారి)చెరువు వద్దకు వెళ్లాడు. ప్రమాదవాశాత్తు చెరువులో జారిపడి గల్లంతయ్యాడు. అప్పటి నుంచి అతడి కోసం గాలిస్తుండగా మంగళవారం మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటనపై గొల్లప్రోలు ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వడ్రంగి మృతి



మరణించిన ఏసురత్నం

కడియం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో వడ్రంగి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కడియం గ్రామానికి చెందిన ఐసెట్టి ఏసురత్నం (49) ఈనెల 24న కడియపుసావరంలో ఎస్.సత్తిబాబు ఇంటికి వడ్రంగి పని నిమిత్తం వెళ్లి సాయంత్రం పనిచేస్తూ విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. విషయాన్ని ఏసురత్నం కుమారుడికి తెలియపరిచారు. వెంటనే కడియం ప్రభుత్వాసుపత్రికి వైద్యం నిమిత్తం తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారని పోలీసులు తెలిపారు. మంగళవారం ఏసురత్నం కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ఎం.సురేష్‌కుమార్ కేసు నమోదు చేశారు.

చెట్టు మీద నుంచి జారి పడి వ్యక్తి మృతి



మృతిచెందిన బంగారునాయుడు

తునిరూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): చెట్టు మీద నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తుని మండలం వి. కొత్తూరులో జరిగింది. వి.కొత్తూరు గ్రామానికి చెందిన రైతు బోజంకి బంగారు నాయుడు (41) తన పొలంలో చింత చెట్టు ఎక్కి చింతకాయలు తెంచే క్రమంలో కాలు జారి కింద పడడంతో తలకు బలమైన గాయమై మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక మత్స్యకారుడి ఆత్మహత్య

కరప, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక మత్స్యకారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరప మండలం ఉప్పలంక గ్రామానికి చెందిన కొప్పనాతి గంగాధరరావు(65) చేపల వేట సాగిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. అతడికి భార్య, ఒక అబ్బాయి, ఒక అమ్మాయి ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న గంగాధరరావు మంగళవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధృవీకరించారు. అయితే దీనిపై ఇంతవరకు తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సునీత చెప్పారు.

మేధో సంపత్తి హక్కుల స్పెక్ట్రమ్‌పై నిపుణుల చర్చ

రాజానగరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జీజీయూ ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో స్పెక్ట్రమ్ ఆఫ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్-అవలోకనం విద్యారంగానికి దాని ప్రాముఖ్యత అనే అంశంపై మంగళవారం నిపుణుల చర్చ జరిగింది. అడ్వకేట్ అండ్ పేటెంట్ అలార్నీ బెంగళూరు ఇండియన్ ఇనిస్టిట్యూషన్స్ ఆఫ్ సైన్సు(ఐఐఎస్‌సీ) లీగల్ అడ్వైజర్ బృందా కె.వర్మ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. పరిశోధనల్లో వాణిజ్య విలువలున్న అంశాలకు పేటెంట్ హక్కులు పొందడం గురించి వివరించారు. కార్యక్రమంలో జీజీయూ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, ప్రిన్సిపాల్ టి.జయానందకుమార్, బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ సభ్యులు కేబీఆర్ వర్మ, ప్రిన్సిపాల్స్, హెచ్‌వోడీలు, డైరెక్టర్లు, డీన్లు, పాల్గొన్నారు.

మోక్ష వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

బిక్కవోలు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కొంకుదురులోని చెరువు గట్టు వద్ద మోక్ష వెంకటేశ్వర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం, అదే ప్రాంగణంలో వున్న కనకదుర్గాదేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన సత్తి శేఖర్‌రెడ్డి అనూష దంపతులు కళ్యాణ కర్తలుగా వ్యవహరించి వెంకటేశ్వరస్వామికి కళ్యాణం జరిపారు. గ్రామానికి చెందిన సత్తి నాగిరెడ్డి సుశీల దంపతులు స్వామివార్కి పట్టుబట్టలు, మంగళ సూత్రాలను బహూకరించారు. అనంతరం దాతల సహకారంతో భారీ ఎత్తున అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

సారా నిర్మూలనే లక్ష్యంగా నవోదయం 2.0

రంగంపేట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సారా నిర్మూలనే నవోదయం 2.0 లక్ష్యమని, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శివప్రసాద్ పేర్కొన్నారు.మంగళవారం మండలంలోని ఈలకొలను గ్రామంలో సారా నిర్మూలనపై గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసి స్టెంట్ సూపరింటెండెంట్ వినీష పాల్గొని మాట్లాడారు.గ్రామస్థుల సహకారంతోనే సారా నిర్మూలన సాధ్యమతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ, కార్యదర్శి శ్రీనివాస్, ఎక్సైజ్ ఎస్‌ఐ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

తప్పుడు కేసులు బనాయించడం సరికాదు

గుమ్మళ్ళదొడ్డి గ్రామస్థులు

గోకవరం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామంలో జనావాసాల మధ్య నిర్మించిన అస్సాగో ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న తమపై ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయిండం సమంజసంకాదని గ్రామస్థులు చందాసి చినిబాబు, అబిరెడ్డి చిన్ని, బూలా అబ్బులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం విలేకరులతో వారు మాట్లాడుతూ తాము ప్రజల తరుపున ఉద్యమం చేస్తుంటే తమ వల్లే ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయంటూ తమతో పాటు మరికొందరిపై తప్పుడు కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇంతకాలం తమపై ఎటువంటి కేసులు నమోదు చేయని పోలీసులు ఇపుడు హఠాత్తుగా నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. కాలుష్య కారకమైన పరిశ్రమ నిర్మాణం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం పరిశ్రమ నిర్వాహకులు ఆదేశించినట్టు నడుచుకోవడం అన్యాయమని అన్నారు.

830 ఎకరాల్లో నేలకొరిగిన వరి పంట

ఏవో రాజేశ్వరి.. గోకవరంలో నేలకొరిగిన పంటల పరిశీలన

గోకవరం, మార్చి25(ఆంధ్రజ్యోతి): మండలంలోని 830 ఎకరాల్లో వరి, 280 ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగినట్టు ఏవో రాజేశ్వరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని తంటికొండ గ్రామంలో సోమవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి నేలకొరిగిన పంట పొలాలను మంగళవారం తహశీల్దారు సాయిప్రసాద్ పరిశీలించారు. మండలంలో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షానికి నష్టపోయిన పంటల వివరాల జాబితాను ప్రభుత్వానికి నివేదించనున్నట్టు తహశీల్దారు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బదిరెడ్డి అచ్చన్నదొర, బదిరెడ్డి బాబి, నాగం వెంకటపతి, గెడ్డం బాబు, రెవున్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సంఘ అభివృద్ధికి రైతులు సహకరించాలి: ఎంపీపీ

కడియం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): బ్యాంకు ద్వారా రుణాలు తీసుకున్న రైతులు, కౌలురైతులు సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని అన్నారు. మంగళవారం కడియం పీఏసీఎస్ మహాజన సభ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి ఎం.కృష్ణమోహన్ అధ్యక్షతన జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, కొనుగోలు చేసిన ధాన్యానికి సకాలంలో చెల్లింపులు, రైతులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీఈవో ఎస్.అప్పారావు, నీటి సంఘం అధ్యక్షుడు చిక్కాల ఈశ్వరరావు, సభ్యులు చిలుకూరి లక్ష్మణరావు, జగతా వెంకటేష్, గెద్దాడ విఘ్నేశ్, తోట శ్రీను, చిలుకూరి ప్రభాకర్, కొండలరావు పాల్గొన్నారు.

నవోదయకు ముగ్గురి ఎంపిక

కోరుకొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పశ్చిమగోనగూడెం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు నవోదయ పాఠశాలలో ప్రవేశానికి ఎంపికయ్యారు. సీట్లు సాధించిన వారిలో మొసలి రోహిత్, రాజమండ్రపు శ్రీహర్ష, బండి మహిమ ఉన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం ఎస్‌వీఎన్‌ప్రసాద్, శర్మ, శ్రీనివాస్, నాగేశ్వరరావు, బీఎస్‌ఏ లక్ష్మి, ఈ.శ్రీలత అభినందించారు.

సింగంపల్లి నుంచి ఒకరు..

రంగంపేట,మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగంపల్లిలో శ్రీవిద్య ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థి దేవిశెట్టి సాయిధర్మతేజ నవోదయలో సీటు సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'పల్లెబాట'

ఎమ్మెల్యే బత్తుల



కోటిలో గ్రామస్థుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు పల్లెబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. మంగళవారం సాయంత్రం మండలంలోని కోటి గ్రామంలో ఆయన అధికారులతో కలిసి పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా గ్రామస్థులు ఇచ్చిన అర్జీలు స్వీకరించారు. కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. 10నెలల కాలంలోనే కూటమి ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రాజానగరం నియోజకవర్గంలో ఐటీఐ, డిగ్రీకళాలలు ఏర్పాటు, రహదారులు నిర్మాణం వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ విప్లవసాధనే లక్ష్యంగా ఉద్యమించాలి

ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షురాలు టాన్యా

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : దున్నేవానికి భూమి దక్కాలని, వ్యవసాయ విప్లవ సాధన కోసం ఉద్యమించాలని, రైతాంగ పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని మహారాష్ట్రలోని నాందేడ్‌లో అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) 3వ మహాసభల్లో తీర్మానించినట్టు జాతీయ అధ్యక్షురాలు పి.టాన్యా మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మహాసభలు విజయవంతంగా జరిగాయని తెలిపారు. ఈ మహాసభల్లో జాతీయ అధ్యక్షురాలిగా తాను, ప్రధాన కార్యదర్శిగా అశోక్‌ఘాయల్ (మహారాష్ట్ర) ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు పేర్కొన్నారు. ఈ మహాసభలో పలు తీర్మానాలు ఆమోదించామని తెలిపారు. పోలవరం నిర్వాసితులను పూర్తిస్థాయిలో ఆదుకోవాలని, పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధాన్ని తక్షణమే ఆపాలని, ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ఐక్యరాజ్యసమితి తక్షణ జోక్యంతో నిలిపివేయాలని, ప్రపంచ దేశాలపై ట్రంప్ విధిస్తున్న ఆర్థిక ఆంక్షలను ఎత్తివేయాలని, నూతన మార్కెటింగ్ చట్టాలను రద్దు చేయాలని తీర్మానాలను ఆమోదించినట్టు తెలిపారు.

ఆస్తి పన్నులపై 50శాతం వడ్డీ రాయితీ

కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పన్నుచెల్లింపుదారుల సౌకర్యార్థం వడ్డీలో 50శాతం రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని మునిసిపల కమిషనర్ కేతన్ గార్గ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో ఇంటి పన్నులు, ఖాళీస్థలాల పన్నులు సకాలంలో మొదటి అర్ధ సంవత్సరానికి జూన్‌లోపు, రెండో అర్ధ సంవత్సరానికి డిసెంబరులోపు చెల్లిస్తే 2శాతం వడ్డీతో కలిపి చెల్లించవలసి ఉంటుందని అయితే పన్ను చెల్లింపుదారుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు మునిసిపాలిటీ, కార్పొరేషన్‌లో పేరుకుపోయిన పన్ను బకాయిల వసూళ్ల మెరుగుపరుచుటకు.. బకాయిలను ఈనెల 31వ తేదీ లోగా ఒకేసారి చెల్లిస్తే ప్రభుత్వం 50శాతం వడ్డీ రాయితీ కల్పిస్తుందని కమినర్ పేర్కొన్నారు.

టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాస్‌కు ఉత్తమ సేవా పురస్కారం

గోకవరం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ వ్యాధి సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినం సందర్భంగా రాజమహేంద్రవరంలో జరిగిన ఓ కార్యక్రమంలో శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. మండలంలో టీబీ వ్యాధిగ్రస్థులకు శ్రీనివాస్ అందిస్తున్న సేవలకు గాను ఆయన ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

వణికిస్తున్న మూగజీవాలు

కుక్కలు, కోతులు, ఆవులు గుంపులు గుంపులుగా స్వైర విహారం



గోకవరంలో ప్రధాన రహదారిపై తిష్ట వేసిన ఆవులు



గోకవరంలో సంచరిస్తున్న వీధి కుక్కలు

- స్థానికులు, పశువులను గాయపరుస్తున్న ఊరకుక్కలు
- ఇళ్లలో వస్తువులను ఎత్తుకెళుతున్న వానరాలు..
- అడ్డుకుంటుంటే దాడులు
- రహదారిపై తిష్ట వేస్తున్న గోవులు
- గ్రామాల్లో తిరుగుతూ పరిశుభ్ర వాతావరణాన్ని అపరిశుభ్రం చేస్తున్న పందులు
- ఇబ్బందుల్లో గోకవరం వాసులు

గోకవరం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మూగ జీవాలు బెడద ఎక్కువైంది. కుక్కలు, కోతులు, ఆవులు గుంపులు, గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. వీటి నివారణకు అధికారులు చర్యలు చేపట్టక పోవడంతో నిత్యం ఏదొక ప్రాంతంలో దాడులకు తెగబడుతున్నాయి. దీంతో రోడ్లపై ప్రజలు ధైర్యంగా తిరగలేని పరిస్థితి నెలకొంది. ఎప్పుడు ఎటువైపు నుంచి కుక్కలు, కోతులు దాడి చేస్తాయో తెలియని పరిస్థితి కొనసాగుతుంది. ఇళ్ల ముందు పిల్లలు ఆడుకుంటే చాలు ఒక్క మాటున మీద పడి గాయపరుస్తున్నాయి. ద్విచక్ర వాహనదారుల వెంట పడి తరుముతున్నాయి. రాత్రి వేళ కుక్కలకు మనుషులు కనిపిస్తే చాలు మీదకు దూకుతున్నాయి. ముఖ్యంగా





రంపయర్రంపాలెంలో కోతులు

మహిళలు, పిల్లలు బయటకు రావాలంటే భయపడిపోతున్నారు. పశువులను కూడా తీవ్రంగా గాయపరిచిన సందర్భాలున్నాయి. కోతులు గుంపులుగా ఇళ్లపై పడుతున్నాయి. గృహల్లోకి చొరబడి వస్తువులు ఎత్తుకెళుతున్నాయి. ఆ సమయంలో అడ్డుపడే ప్రయత్నం చేస్తుంటే మీదకు ఉరికి దాడులకు యత్నిస్తున్నాయి. నిత్యం వందలాది కోతులు నివాస గృహల మధ్యే తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. గోకవరంలో పశువుల సంచారం రాత్రి, పగలూ తేడా లేకుండా సంచరిస్తున్నాయి. ముఖ్యంగా ప్రధాన రహదారిపై అడ్డదిడ్డంగా తిరగడం, ఒకేచోట గుంపుగా సేద తీర్చుకోవడం చేస్తున్నాయి. దీని వల్ల వాటిని తప్పించుకొని వెళ్లే సమయంలో వాహనదారులు ప్రమాదబారిన పడి గాయపడుతున్నారు. ఒక్కోసారి అవి పొట్లాటకు దిగి సమీపంలో ఉన్న దుకాణాల్లోకి చొరబడి నష్టం చేయడంతో పాటు, అటుగా వెళ్లే వాహనదారులపై పడి గాయపరుస్తున్నాయి. ఈ విషయంలో అధికారులకు స్థానికులు ఎన్నిమార్లు మొరపెట్టుకున్నా ఫలితం ఉండడం లేదు. పంచాయతీ అధికారులు కూడా యజమానులకు ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా వారూ చెవికి ఎక్కించుకోవడం లేదు. గుమ్మళ్ళదొడ్డి గ్రామంలో పందులు గుంపులుగా తిరుగుతూ పరిశుభ్రంగా ఉన్న వాతావరణాన్ని అపరిశుభ్రం చేస్తున్నాయి. మురుగు కూపాల్లో దొర్లుతూ జనవాసాలు మధ్య కలియ తిరగడం వల్ల ఎటువంటి అనారోగ్యం బారిన పడతామోనని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూగజీవాల బారి నుంచి ప్రజలను రక్షించాలని పలువురు కోరుతున్నారు.



గుమ్మళ్లదొడ్డిలో పందుల సంచారం

నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని పునరుద్ధరించాం

» నన్నయ వర్సిటీ వీసీ ప్రసన్నశ్రీ



వీసీ ప్రసన్నశ్రీతో సమావేశమైన డీఆర్‌డీఏ అధికారులు

దివాన్‌చెరువు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నన్నయ వర్సిటీలో కొంతకాలంగా మూసివేసిన నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని పునరుద్ధరించినట్టు వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డీడీజీ మురళి మంగళవారం వీసీని కలిసారు. ప్రస్తుతం నైపుణ్యాభివృద్ధి కేంద్రం అందిస్తున్న కోర్సులపై ఆరాతీసారు. కొంతకాలంగా ఎటువంటి కోర్సులు అందించడంలేదని తెలియడంతో వెంటనే కేంద్రం తెరవాలని వీసీ ఆదేశించారు. వెంటనే మధ్యాహ్నం కే కేంద్రం తెరిచారు. విద్యార్థులతో బాటు నిరాధారంగా ఉన్న మహిళలకు ఉపాధి యోగ్యమైన కొత్తకోర్సులు ఏర్పాటు చేసే విధంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఆమె వెంట నన్నయ నైపుణ్యాభివృద్ధి అధికారి బి.జగన్మోహనరెడ్డి, ఆచార్య పి.సురేష్‌వర్మ, జిల్లా నైపుణ్యాభివృద్ధి కేంద్రం అధికారి ఏఎస్ఆర్ మూర్తి ఉన్నారు. ఇదిలా ఉండగా డీఆర్‌డీఏ వీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, రెడ్ క్రాస్ జీవిత సభ్యులు జి.మహలక్ష్మి, జిల్లా కోఆర్డినేటర్ పి.రాంబాబు నన్నయ యూనివర్శిటీని సందర్శించి వీసీ ప్రసన్నశ్రీని మర్యాదపూర్వకంగా కలిసారు. వర్సిటీ విద్యార్థులకు రెడ్‌క్రాస్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాల వైపు విద్యార్థులను నడిపించాలన్నారు.

వీసీని సత్కరించిన జీజీయూ ప్రతినిధులు

రాజానగరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జీజీయూ ప్రతినిధులు రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, గైట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.వల్లీమాధవి, డీన్ బి.శ్రీనిసారరాజా మంగళవారం నన్నయ వర్శిటీని సందర్శించి, వీసీ ప్రసన్నశ్రీని కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్తునందించేందుకు రెండు వర్శిటీలు పరస్పర సహకారంతో పనిచేస్తాయని, రెండింటి మధ్య విద్య, పరిశోధన, విద్యార్థుల అభివృద్ధి రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకునే విషయాలపై చర్చించారు.

పేదలకు కూటమి భరోసా

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి



రాజమహేంద్రవరం రూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి):అభాగ్యుల జీవితాల్లో కాంతిరేఖల సీఎం సహాయనిధి పేదలకు ఎంతో ఉపయోగ పడుతోందని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. రాష్ట్రం అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సీఎం చంద్రబాబునాయుడు సారధ్యంలో కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని ఎన్డీయే ప్రభుత్వ సహకారంతో అన్నిరంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. వైద్య ఖర్చులు భారమై ఆర్థిక స్తోమత లేని పేదప్రజలకు సీఎం సహాయ నిధి ఎంతగానో భరోసా ఇస్తుందన్నారు. నియోజకవర్గంకు సంబంధించి 42 మంది లబ్దిదారులకు రూ. 45 లక్షల సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులు ఎమ్మెల్యే గోరంట్ల అందచేసారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

అనపర్తిలో పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

అనపర్తి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అనపర్తి శివారులో పేకాట శిబిరంపై సోమవారం రాత్రి దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ శ్రీను నాయక్ తెలిపారు. గ్రామ శివార్లలో పేకాట జరుగుతుందన్న సమాచారంతో దాడులు జరిపామని, ఈ దాడుల్లో ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.3050 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

హౌసింగ్ స్కీమ్‌కు అదనపు నిధులు

లబ్ధిదారులకు రూ.1.51 కోట్ల చెక్‌ను అందించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



రూ.1.51 కోట్ల చెక్‌ను లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ సొంత ఇంటి కలను నెరవేర్చాలని ఎన్‌టీఆర్ హౌసింగ్ స్కీమ్ కింద ఎస్సీ, ఎస్టీ,బీసీలకు అదనంగా మంజురు చేసిన నిధులు రూ.1.51 కోట్ల చెక్‌ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ లబ్ధిదారులకు అందించారు. స్థానిక తిలక్‌రోడ్డులోని తన కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమం లో నగరానికి సంబంధించి 1054 మంది హౌసింగ్ లబ్ధిదారులకు అదనంగా రూ.1,51,24,500 మంజూరు చేశారని ఆదిరెడ్డి చెప్పారు. హౌసింగ్ స్కీమ్‌లో ఎస్సీలకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, నేతకార్మికులకు రూ.50 వేలు చొ ప్పున అందించారని తెలిపారు. మురికివాడలు, అనధికార నివాసితులకు నాణ్యమైన గృహాలను అందించడానికి ప్రభుత్వం ఎన్‌టీఆర్ హౌసింగ్ స్కీమ్‌ను ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, రెవెన్యూ అధికారులు, నగరపాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత సమాజమే ధ్యేయం

సారా రహిత సమాజం దిశగా ఆంధ్రప్రదేశ్ నినాదంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ముద్రించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా రహితంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సారా విక్రయాలు, అసాంఘిక కార్యాకలాపాలపై 14405 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు చెల్లించాలి

ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ఫీల్డ్‌స్టాఫ్ వినతి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టులో పనిచేస్తున్న ఫీల్డ్‌స్టాఫ్ అందరినీ ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం చెల్లించాలని ఎన్టీఆర్ వైద్యసేవ ఫీల్డుస్టాఫ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఎన్టీఆర్ వైద్య సేవలో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలు, టీం లీడర్లు, ఆఫీస్ అసోసియేట్లు, సీసీ కెమెరా టెక్నీషియన్స్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 17ఏళ్లుగా పనిచేస్తున్న తమకు కేడర్ అమలు జరగకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోయామని, రాష్ట్ర ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజ్ ఇవ్వడంలేదని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేవని తెలిపారు. అలాగే ప్రభుత్వ వెబ్‌సైట్‌లో తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం వల్ల సంక్షేమ పథకాలకు అర్హత లేకుండా పోయిందని వాపోయారు. తమ ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏపీ ఆరోగ్యమిత్ర కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ తరపున శాంతియుత నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరినట్టు వారు పేర్కొన్నారు.

29న వాహనాల వేలం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో జప్తు చేయబడిన వాహనాలను జిల్లా రవాణాశాఖ అధికారి కార్యాలయం ప్రాంగణంలో ఈనెల 29వ తేదీ ఉదయం 10:30గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాహనాలు ప్రస్తుతం ఉన్న కండీషన్‌లో వేలం వేస్తామని, ఆసక్తి ఉన్నవారు ముందుగా వాహనాలను తనిఖీ చేసుకోవచ్చని, వేలంలో పాల్గొనేవారు రూ.2,000 డిపాజిట్ చేయాలని, రూ.200 సర్వీస్ ఛార్జి చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వేలం తర్వాత సర్వీస్‌ఛార్జి ఇవ్వబడదని, డిపాజిట్ సొమ్ము రూ.2,000 తిరిగి చెల్లిస్తామని చెప్పారు. పాటదారుడు వేలం సొమ్ములో 50శాతం వెంటనే చెల్లించాల్సి ఉంటుందని, మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

అంజలికి న్యాయం జరుగుతుంది: ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సోదరి అంజలికి న్యాయం జరిగేలా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రాత్రి బొల్లినేని ఆసుపత్రికి వచ్చి అంజలి పరిస్థితిని ఆయన పరిశీలించారు. ఆమె తల్లిదండ్రులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంజలి ఆత్మహత్యాయత్నం చేశాక డైరీ దొరికిన తర్వాత ఆమెకు జరిగిన అన్యాయం వెలుగులోకి వచ్చిందన్నారు. నిందితుడు డాక్టర్ దీపక్ అతని కుటుంబంతో పరారిలో ఉన్నాడని, అతడిని బొల్లినేని ఆసుపత్రి నుంచి తొలగించారని చెప్పారు. పోలీసులు కూడా కేసులు నమోదు చేశారని చెప్పారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలి

బిక్కవోలు మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. గత ఐదేళ్ల నియోజక వర్గంలో సర్పంచ్, ఎంపీటీలకు ఏవిధంగా వైసీపీ ప్రభుత్వం గౌరవం ఇవ్వలేదని తాము అధికారంలోకి వచ్చాక గౌరవం కల్పిస్తున్నామన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. గత 8నెలల్లో తాము నియోజకవర్గంలో రూ. 14 కోట్లతో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. కెనాల్ రోడ్‌ను పట్టించుకోకుండా బ్లాక్ లిస్టులో వుందని ప్రచారం చేసి తప్పించుకున్నారని, తాము వచ్చిన వెంటనే రూ.6 కోట్లతో మరమ్మతులు చేపట్టామన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్ రూ.1.70 లక్షల మిగులుతో మండల పరిషత్ ఆమోదించారు. ఆదాయం రూ.34,84,20,000 కాగా వ్యయం రూ.34,82,50,000 అవుతుందని అంచనా వేశారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీపీ బుద్దాల కన్నారావు, వైస్ ఎంపీపీ పెంకే మంగయ్యమ్మ, ఏవో రత్నకుమార్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి పందలపాక, బలభద్రపురం మసీదుల్లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుల్లో ఎమ్మెల్యే నల్లమిల్లి పాల్గొన్నారు. ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఆయన వెంట పడాల చినబుజ్జి, రావాడ నాగు, నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, సత్తి దేవానందరెడ్డి తదితరులున్నారు.

డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తు గడువు పెంపు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీసర్కిల్ ద్వారా మెగా డీఎస్సీ పరీక్షలకు ఆన్‌లైన్ ఉచితశిక్షణ కోసం దరఖాస్తు గడువును ఈనెల 31వ తేదీ వరకూ పొడిగించినట్టు జిల్లా బీసీ సంక్షేమాధికారిణి, స్టడీ సర్కిల్ సంచాలకులు బి.శశాంక తెలిపారు. టెట్ పరీక్షల్లో అర్హత సాధించిన తూర్పుగోదావరి జిల్లాకు చెందిన బీసీ, ఈబీసీ కేటగిరీలకు చెందిన వారికి మాత్రమే మెగా డీఎస్సీ పరీక్షల ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు నేరుగా స్టడీసర్కిల్ కార్యాలయంలో కానీ, సెల్ నెంబర్లు 93939 34825, 97053 26221లలో సంప్రదించాలని తెలిపారు.



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:20 (బుధవారం సాయంత్రం)
సహర్ : 4:41 (గురువారం ఉదయం)



కుక్కల దాడిలో గాయాలపాలైన చిన్నారి

రేపు ఎన్నికల సందడి

ఒక ఎంపీపీ, రెండు కో ఆప్షన్, 12 ఉపసర్పంచ్ పదవులకు

రాజమహేంద్రవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఒక ఎంపీపీ, 12 ఉపసర్పంచ్, రెండు కో ఆప్షన్ సభ్యుల పదవులకు గురువారం ఎన్నిక నిర్వహించనున్నట్టు జేసీ ఎస్.చిన్నరాముడు తెలిపారు.కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం ఎన్నికల అధికారులు, సమన్వశాఖల అధికారులతో సమీక్షించారు. గురువారం ఉదయం 11 గంటలకు ఎన్నికలు పరోక్ష పద్ధతిలో ఎన్నికలు జరుగుతాయన్నారు. బిక్కవోలు ఎంపీపీ,పెరవలి,రంగంపేట మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక నిర్వహిస్తారన్నారు. గోకవరం మండలం మల్లేశ్వరం,కొవ్వూరు మండలం పెనకనమెట్ట, రాజానగరం మండలం పాతతుంగపాడు, గోపాలపురం మండలం కొవ్వూరుపాడు, వెంకటాయపాలెం, తాళ్లపూడి మండలం తాడిపూడి,అనపర్తి మండలం లక్ష్మీనరసింహాపురం, రంగంపేట మండలం మర్రిపూడి, కడియం మండలం మురమండ, సీతానగరం మండలం మునికూడలి, ఉండ్రాజవరం మండలం ఉండ్రాజవరం గ్రామ ఉపసర్పంచ్ పదవులకు ఎన్నిక జరగనుందన్నారు. ఎంపీపీ, కోఆప్షన్ సభ్యుల ఎన్నికకు ఆ రోజు ఉదయం 10 గంటలకు నామినేషన్లు స్వీకరించి మధ్యాహ్నం 12 గంటల్లోపు పరిశీలన పూర్తి చేయాలని చెప్పారు.తర్వాత అర్హుల జాబితా ప్రకటించాలన్నారు.అభ్యర్థిత్వ ఉపసంహరణ గడువు మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ఉంటుందని చెప్పారు.

అమ్మా.. నేను మోసపోయా!



అమ్మా నేను మోసపోయా.. నాకు బతకాలని లేదు.. నా గురించి బాధపడొద్దు.. నా అవయవాలన్నీ దానం చేయండి అంటూ ఒక వైద్య విద్యార్థిని సూసైడ్ నోట్ రాసి 23వ తేదీన ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది..ఆమె పరిస్థితి విషమంగా ఉంది. ప్రస్తుతం ఆ విద్యార్థిని బొల్లినేని కిమ్స్ ఆసుపత్రిలో ఇంటర్న్‌షిప్ చేస్తోంది. ఆ ఆసుపత్రిలో పనిచేసే ఒక వ్యక్తి వేధింపుల కారణంగానే యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని మంగళవారం సహచర విద్యార్థులు ఆందోళనకు దిగారు.. నిందితుడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.ఎండను సైతం లెక్కచేయకుండా రోడ్డుపై బైఠాయించారు. రాజానగరం, రాజమహేంద్రవరం ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆసుపత్రి వద్దకు చేరుకుని ఆందోళనకారులను సముదాయించారు. ఆడబిడ్డకు అన్యాయం జరిగితే సహించబోమని హెచ్చరించారు. - వివరాలు 7లో

అమ్మానుషం!

- ముళ్ల పొదల్లో చిన్నారి
- కుక్కలు పీక్కుతిన్న వైనం
- ఆసుపత్రికి తరలింపు

నల్లజర్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అమ్మ నులివెచ్చని పొత్తిళ్లలో ఉండాల్సిన చిన్నారిని వద్దని విసిరేయడంతో.. కుక్కలు పీక్కుతిన్న విషాదఘటన తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పోతవరంలో మంగళవారం చోటుచేసుకుంది. పోతవరం-యర్నగూడెం రోడ్డులో పొగాకు బ్యారన్ల దగ్గర ఉన్న ముళ్లపొదల్లో ముక్కుపచ్చలారని ఆడశిశువును గుర్తు తెలియని వ్యక్తులు పడేసి వెళ్లిపోయారు.ఉదయం పాలు తీసుకురావాడానికి అటుగా వెళ్తున్న రైతులు శిశువును కుక్కలు పీక్కుతినడం చూసి విస్తుపోయారు. వెంటనే కుక్కలను తరిమికొట్టి శిశువును కాపాడి వైద్యసిబ్బందికి సమాచారం అందించారు.ఈ మేరకు ఏఎన్ఎం మహాలక్ష్మి,గ్రామ సంరక్షణ అధికారి దీపిక సంఘటనా స్థలానికి వెళ్లి రక్తపు మడుగులో ఉన్న శిశువును తీసుకుని వచ్చి ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం డాక్టర్ రాజశేఖర్ శిశువును పరిశీలించి మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శిశువుకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి రక్తం ఎక్కించారు.నల్లజర్ల సీఐ వై.రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలానికి వెళ్లిన సీఐ సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. సీడీపీవో నాగలక్ష్మి, ఏసీడీపీవో పద్మావతి, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి ఏలూరు వెళ్లి శిశువును పరిశీలించి సంరక్షణ కోసం ఇద్దరి ఆయాలను అక్కడ ఉంచారు. మరో 48 గంటలు దాటితే తప్ప ఆరోగ్య పరిస్థితి చెప్పలేమని వైద్యులు తెలిపినట్టు సీడీపీవో నాగలక్ష్మి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ మృతి

- హత్య చేశారని ఆరోపణ
- ప్రభుత్వాసుపత్రి వద్ద ఉద్రిక్తత
- మృతుడిది హైదరాబాద్

8

కూటమిలోనూ.. కదలికేది!



రాజమహేంద్రవరంలో మెడికల్ కళాశాల నిర్మాణం ఇలా...

- మెడికల్ విద్య..మిథ్య
- తూర్పున కళాశాల ఆరంభం
- వసతులు చూస్తే అరకొరే
- కోనసీమలో భవనాలే లేవు
- నేటికీ పునాది దాటని వైనం
- నాలుగేళ్లయినా నేటికీ ఇంతే
- వైసీపీ నిర్వాకం..సాగని పనులు
- రంగరాయలోనూ వసతుల్లేవ్
- 10 నెలలైనా పట్టని కూటమి
- మెడికల్ విద్యార్థుల ఇక్కట్లు

నాడు అంతన్నారు.. ఇంతన్నారు.. పూర్తిచేయకుండా వదిలేశారు.. నాలుగేళ్లయ్యింది.. నేటికీ నిర్మాణంలోనే ఉన్నాయి.. ఇదీ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మెడికల్ కళాశాలల తీరు.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్ర వరంలో అయితే భవన నిర్మాణాలు పూర్తికాకుండానే తరగతులు ప్రారంభించేశారు.. సౌకర్యాలు చూస్తే అరకొరే.. విద్యార్థులకు ఇబ్బందే.. అయినా పట్టించుకునేవారే లేరు.. కన్నెత్తి చూసేవారు కానరావడంలేదు.. ఇక అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అయితే నేటికి భవన నిర్మాణాలు పునాది దశనూ దాటలేదు..ఎక్కడి పనులు అక్కడే అన్నట్టు ఉన్నాయి.. కాకినాడ జిల్లా రంగరాయ మెడికల్ కళాశాలలోనూ నేటికీ సమస్యలు వెన్నాడుతు న్నాయి.. గత సర్కారులో సరే సరి.. కూటమి ప్రభుత్వంలోనూ కదలికలేకపోవడంపై 'ఆంధ్రజ్యోతి' ఫోకస్..

మెడికల్ కళాశాలల నిర్మాణ పనులు నత్తనడక

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వం ఆర్భాటాలకే కానీ.. వాస్తవ రూపంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించక పోవడం వల్ల మెడికల్ కాలేజీ, కొత్త ఆసుపత్రి నిర్మాణ పనులు నత్తనడకన సాగాయి. కూటమిలోనైనా వేగం పుంజుకున్నాయా అంటే అదీ లేదు. సమస్య ఏమిటో కానీ నాడు పనులు ఎలా ఉన్నాయో నేటికీ అలాగే ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నా కాంట్రాక్టర్లు వేగంగా పనిచేయడం లేదనే అక్కడి అధికారులే చెప్పడం గమనార్హం. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మొత్తం రూ.475 కోట్లతో మెడికల్ కాలేజీ, ఆసుపత్రి భవనాలు నిర్మించాల్సి ఉంది.కానీ ఇప్పటి వరకూ కేవలం రూ.100 కోట్ల పని మాత్రమే జరిగింది. ఏడాదికి 150 మంది విద్యార్థులతో నడుస్తున్న ఈ కాలేజీలో ప్రస్తుతం రెండో బ్యాచ్ నడుస్తోంది. సెప్టెంబర్‌కు మూడో బ్యాచ్ వస్తుంది. ప్రతి ఏడాది 150 సీట్లలో 110 నుంచి 120 వరకూ అమ్మాయిలే చేరడం గమనార్హం. వారు ఇంత వరకూ హాస్టల్ సౌకర్యం లేక ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం బాలికలు 360 మందికి, బాలురు 120 మందికి సరిపడా హాస్టల్ కట్టారు.కానీ ఇవి ఇంకా పూర్తిగా అందుబాటులోకి లేదు.అంతే కాకుండా కాలేజీ భవనం పూర్తి కాలేదు. మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు క్లాసులు పీఈడీ (నర్సింగ్ విద్యార్థులకు నిర్మించిన) భవనంలో జరుగుతున్నాయి. మూడో బ్యాచ్ సెప్టెంబరులో రానుంది.అప్పటికి కొత్త కాలేజీ భవనం నిర్మాణం కాకపోతే ఇబ్బందే.కొత్త కాలేజీ భవనంలో 17 శ్లాబ్‌లకు 15 పూర్తి చేశారు.ఇంకా రెండు పూర్తి చేయాలి. విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.ఇక్కడ మెడికల్ కళాశాలకు అనుబంధంగా 500 పడకల కొత్త బోధనాసుపత్రి నిర్మించాల్సి ఉంది.దానికి భూమిని సిద్ధం చేసినా కదలిక లేదు.ఇప్పటికే పేషెంట్ల సంఖ్య పెరిగిందని,పుష్కరాల నాటికి బాగా పెరుగుతుందని, అప్పటికి కొత్త ఆసుపత్రి అందుబాటులోకి రావాలని ఇటీవల ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు.గత వైసీపీ అసలు కొత్తభవనం గురించి పట్టించుకోలేదు. కూటమి వచ్చిన తర్వాత పాత భవనాలు తొలగించి స్థలాన్ని సిద్ధం చేసినా పనులు ఆరంభంకాలేదు.



కోనసీమలో ఆగిపోయిన మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు

కోనసీమలో ఆగిపోయిన పనులు..

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

నాలుగేళ్లు కావొస్తున్నా ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణాలు పునాదుల దశలను దాటలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కళాశాల నిర్మాణ పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం సెక్యూరిటీ గార్డుల పర్యవేక్షణలోనే పునాదుల్లో ఉన్న భవనాలు, నిర్మాణ సామగ్రి ఉన్నాయి. వందల కోట్లతో చేపట్టిన వైద్య కళాశాల భవనాల్లో కొన్ని శ్లాబ్‌ల దశలకు చేరుకున్నాయి. ప్రధాన వైద్య కళాశాల భవనం పునాదుల స్థాయికి మాత్రమే పరిమితమైంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణానికి కూతవేటు దూరం సమనస గ్రామంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021 మే 31న అప్పటి సీఎం వైఎస్ జగన్ వర్చువల్ విధానంలో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నాటి నుంచి వైద్య కళాశాల నిర్మాణ పనుల ప్రగతి 'మిథ్య'గా మారింది. 56 ఎకరాల్లో రూ.475 కోట్లతో చేపట్టిన ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. 32 భవనాలు నిర్మించాల్సి ఉన్నా ప్రస్తుతం 17 భవనాలు వివిధ దశల్లో మాత్రమే నిర్మించడానికి కాంట్రాక్టు సంస్థ అయిన మెగా ఇంజనీరింగ్ చర్యలు చేపట్టింది. ప్రధానమైన 750 పడకల ఆస్పత్రి కీలక భవనంతో పాటు ఆరు బ్లాకులతో వైద్య కళాశాల భవనాలు శ్లాబ్‌ల దశకు చేరుకున్నాయి. మిగిలిన బాయ్స్, లేడీస్ హాస్టల్స్ భవనాలు కొన్ని శ్లాబ్‌లు పూర్తయ్యాయి. వివిధ రకాల ల్యాబ్‌లు నిర్మాణ పనులు పునాదుల దశలోనే నిలిచిపోయాయి. ఈ వైద్య కళాశాల నిర్మాణ పనులు వచ్చే నెల ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని నాడు వైసీపీ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. కాంట్రాక్టు సంస్థకు సకాలంలో బిల్లులు చెల్లించక పోవడమే పనులు నత్తనడకన జరగానికి కారణమని సమాచారం. సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటై పది నెలలు కావొస్తున్నా వైద్య కళాశాల నిర్మాణ ప్రగతిపై ప్రభుత్వం ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రస్తుతం కళాశాల నిర్మాణ పనుల్లో కీలక పాత్ర వహించిన మెగా సంస్థ స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యాలయాలు, ఇతర సామగ్రిని ఖాళీ చేసి వెళ్లిపోయినట్టు సమాచారం. మరి ఈ కళాశాల భవనాల నిర్మాణాలు మళ్లీ పునఃప్రారంభమయ్యేది ఎప్పుడో వేచి చూడాల్సిందే.



కాకినాడ రంగరాయలోనూ ఇంతేగా!

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలోనే అత్యంత ప్రఖ్యాతి చెందిన రంగరాయ మెడికల్ కాలేజీని అనేక సమస్యలు వెన్నాడుతున్నాయి.సమర్థవంతమైన వైద్యులను తయారు చేయడంతో పేరొందిన ప్రభుత్వ మెడికల్ కాలేజీ అనేక వసతుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా అనేక పనులకు టెండర్లు పిలిచి ఆనక నిధులివ్వకపోవడంతో ఇప్పుడవన్నీ వెక్కిరిస్తున్నాయి. ఎప్పుడు పూర్తవుతాయో తెలియక ఎదురుచూస్తున్నాయి.ప్రధానంగా మెడికల్ కాలేజీ విద్యార్థులకు సంబంధించి ఏడాదిగా వసతి గృహాల బ్లాకులు కదలకుండా ఆగిపోయాయి.దాదాపు రూ.70 కోట్లతో ప్రారంభించిన రెండు యూజీ, పీజీ వైద్యుల హాస్టల్ బ్లాకుల నిర్మాణం ప్రారంభమైనా నిధుల్లేక పనులకు గ్రహణం పట్టింది. వందల్లో ఉన్న వైద్యవిద్యార్థులకు జీప్లస్5, జీప్లస్ 4 విధానంలో రెండు బ్లాకుల నిర్మాణం గతేడాది ప్రారంభం కాగా ప్రస్తుతం జీప్లస్5 బ్లాక్ మొదటి అంతస్తు నిర్మాణ దశలోనే ఉంది. జీప్లస్4 బ్లాక్ అయితే ఇంకా పునాదుల స్థాయి దాటలేదు.వైద్య విద్యార్థినులకు సంబంధించి యూజీ, పీజీ వైద్యుల కోసం రూ.100 కోట్లతో జీప్లస్ 5, జీప్లస్ 8 కింద రెండు బ్లాకుల నిర్మాణం ప్రారంభించారు.గతేడాది నుంచీ పనుల్లో కదలికలేదు. నిధుల్లేకపోవడంతో కాంట్రాక్టర్ అడ్రస్ లేడు. జీజీహెచ్‌కు ఇన్‌పేషెంట్ రోగుల తాకిడి అధికంగా ఉండ దంతో కొన్నాళ్ల కిందట సూపర్‌స్పెషాలిటీ బ్లాకులను నిర్మించాలని అధికారులు నిర్ణయించారు.జీజీహెచ్‌కు అనుబంధంగా నర్సింగ్ కాలేజీ, హాస్టల్ నిర్మించాలని భావించి సమీపంలో ఆరెకరాల ప్రభుత్వ భూమి కేటాయించినా పనులు జరగకుండా నిలిచిపోయాయి.



కోనసీమలో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తున్న ఐరన్



కడుపునింపని ఉపాధి!

- ఉపాధి పనిచేస్తున్నా.. పస్తులే
- రెండు నెలలగా అందని వేతనాలు
- రూ. 11.70 కోట్ల బకాయిలు
- నేటికీ అకౌంట్లకు జమకాని వైనం
- లబోదిబోమంటున్న కూలీలు

గోకవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు వేతనాలు నిలిచిపోయాయి. సుమారు రెండు నెలలకు పైగా వారికి కూలీ అందడం లేదు. దీంతో ఆ కుటుంబాల వారికి పోషణ కరువై ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పటికి అందుతాయో అధికారులు ఖచ్చితంగా చెప్పలేకపోతున్నారు. 15 రోజుల్లో వేతనాలు చెల్లించాలనే నిబంధనలు ఉన్నా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. జిల్లాలోని 18 మండలాల్లో మొత్తం లక్షా 26 వేల మంది జాబ్‌కార్డుదారులు ఉన్నారు. వీరిలో ప్రస్తుతం 15,472 మంది ఉపాధి పనికి వెళుతున్నారు. ఇంత వరకు సుమారు రూ.11.70 కోట్లు బకాయిలు కూలీలకు చెల్లించాల్సి ఉంది. మరో రూ.46.42 కోట్లు మెటీరియల్ బకాయిలు రావాల్సి ఉంది. చివరి సారిగా ఈ ఏడాది జనవరి మొదటి వారంలో కూలీలకు వేతనాలు చెల్లింపులు జరిగాయి. ఆ తరువాత ఇప్పటి వరకు ఒక్క రూపాయి వారి బ్యాంక్ ఖాతాలో జమకాలేదు. రెండు నెలలుగా అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనుల్లేక.. ఉపాధి వేతనం అందక లబోదిబోమంటున్నారు. తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో నెట్టుకొస్తున్నారు. కొందరు కూలీలైతే ఉపాధి వేతనాలు వచ్చాక చెల్లించే స్తామంటూ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు రుణాలు తెచ్చి కుటుంబాలను పోషిస్తున్న ఘటనలు ఉంటున్నాయి. గోకవరం మండలంలో 11,183 మందికి జాబ్ కార్డులు ఉండగా వీరిలో సరాసరి రోజుకు 1200 నుంచి 1300 మంది వరకు ఉపాధి పనులకు వెళుతున్నారు. ఇప్పటి వరకు 1246 కుటుంబాలకు వంద రోజుల పనిదినాలు పూర్తయినట్టు ఉపాధి హామీ పథకం అధికారులు చెప్పుకొస్తున్నారు. ప్రస్తుతం పనికి వస్తున్న కూలీలకు వేతనాలు అందడంలేదు.మండలంలో ఇంకుడు గుంతలు, ఫారం పాండ్స్‌మినీ గోకులాలు తదితర పనులు జరుగుతున్నాయి.ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే కూలీల ఖాతాల్లోకి జమ చేస్తామని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో 10 ఆర్‌వోబీల నిర్మాణం


- సీఎం కాన్ఫరెన్స్‌కు కలెక్టర్
- పలు అంశాలపై నివేదికలు రెడీ
- నేడు సీఎం ముందు ప్రజంటేషన్



అమరావతిలో మంగళవారం జరిగిన సీఎం చంద్రబాబు కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ ప్రశాంతి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడంతో జిల్లాకు మంచిరోజులు వస్తున్నాయి. సీఎం చంద్రబాబునాయుడు విజన్‌తో కలెక్టర్ పి.ప్రశాంతి 2025-26 జిల్లా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు.అమరావతిలో మంగళవారం సీఎం చంద్రబాబు సమక్షంలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ మొదలైన సంగతి తెలిసిందే. ఇది బుధవారం కూడా జరగనుంది. షెడ్యూల్ ప్రకారం బుధవారం కలెక్టర్ యాక్షన్ ప్లాన్‌ను సీఎం ముందు ప్రజంటేషన్ చేయనున్నారు. వ్యవసాయం నుంచి టూరిజం వరకూ అభివృద్ధిపై పలు అంశాలతో విజన్ డాక్యుమెంటరీ సిద్ధం చేశారు. జిల్లాలో 77,820 హెక్టార్లలో పంట లక్ష్యంగా నిర్ణయించారు. 4970 హెక్టార్లలో ఉద్యాన పంటలను ప్రోత్సహించనున్నారు. జిల్లాలో 12 శాతం నుంచి 15 శాతం వరకూ పాలు, మాంసం, గుడ్ల వృద్ధి రేటు లక్ష్యంగా పెట్టుకున్నారు. 2 వేల హెక్టార్లలో మత్స్య సంపదను అదనంగా పెంచే లక్ష్యం పెట్టుకున్నారు.కడియంలో క్రైయో ప్రిజర్వేషన్ ల్యాబ్ స్థాపిస్తారు.రెవెన్యు పెంచడమే లక్ష్యంగా జిల్లాలో మైనింగ్ అండ్ క్వారీయింగ్‌కు లీజులను ఆపరేషన్‌లోకి తీసుకు రానున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ వృద్ధి కోసం నానో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయనున్నారు. విశ్వకర్మ యూనిట్లను స్థాపిస్తారు. కల్వచర్లలో ఇండస్ట్రియల్ పార్కు అండ్ జియో -బయోఫ్యూయల్ ఇండస్ట్రీని ప్రారంభించనున్నారు. జిల్లాలో పీఎం సూర్యఘర్ పథకం కింద 7500 కిలో వాట్స్ సామర్థ్యంతో 2500 ఇళ్లపై రూఫ్‌టాప్ ఏర్పాటు చేయనున్నారు. పంచాయతీ రాజ్ శాఖ కింద జిల్లా వ్యాప్తంగా 12 మండలాల పరిధి లోని 49 హేబిటేషన్లలో రూ.29.24 కోట్ల నాబార్డ్ నిధులతో 17 పనులను పూర్తి చేయనున్నారు.రూ.85 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 160 కిలోమీటర్ల మేర సీసీ, బీటీ రోడ్లు నిర్మించనున్నారు. నిడదవోలు వద్ద ఆర్వోబీని రూ.184.74 కోట్లు, రాజానగరం నుంచి సామర్లకోట వరకూ రూ.298.70 కోట్లతో ఏడీబీ రోడ్డు అభివృద్ధి చేస్తున్నారు. ఖమ్మం మీదగా పట్టిసీమ జిల్లా వరకూ 40.4 కిలోమీటర్ల మేర రూ.368.63 కోట్లతో జాతీయ రహదారిని నిర్మించనున్నారు.జిల్లాలో 10 ఆర్వోబీలు నిర్మించనున్నారు. జిల్లాలో 10,794 ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నారు. రూ.347.15 కోట్లతో జరుగుతున్న రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టు రెండో టెర్మినల్ పనులు వచ్చే ఆగస్టు 30వ తేదీ నాటికి పూర్తి చేస్తారు. భవనాలకు రూ. 204 కోట్లు ఖర్చుచేస్తున్నారు. అక్టోబరులో ఇంటర్నేషనల్ ఫ్లవర్ షో కడియపులంకలో నిర్వహించనున్నారు.బ్రిడ్జిలంకలో అడ్వంచర్ స్పోర్ట్స్ అభివృద్ధి చేస్తారు. విజయవాడ- వైజాగ్ రైల్వే రూట్‌లో డబ్లింగ్ కింద శెట్టిపేట,సింగవరం, తాళ్లపాలెం గ్రామాల మీద బైలైన్ నిర్మించనున్నారు. బొమ్మూరు వద్ద ఎస్‌సీడీసీ స్కీమ్ కింద వరల్డ్ లార్జెస్ట్ గ్రెయిన్ స్టోరేజీ అండ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రతిపాదించారు. దీని వల్ల 5 వేల మంది రైతులు లబ్ధి పొందుతారు. 16 ఎంపీ ఎఫ్‌పీ (మల్టీ పర్పస్ ఫెసిలిటేటింగ్ సెంటర్లు)నిర్మిస్తున్నారు.దీని వల్ల వెయ్యి మంది రైతులు లబ్ధి పొందనున్నారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్‌కాలేజీ, ప్రభుత్వాసుపత్రుల వద్ద 4జీ సాట్యురేషన్ ప్రాజెక్టులను నెలకొల్పనున్నారు. కొవ్వూరు వద్ద 50 పడకల ఆసుపత్రిని 150 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయనున్నారు.బయ్యవరం, తుపాకులగూడెం ప్రాంతాల్లోని వైట్‌ఫీల్డ్ పేపరుమిల్లు ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన 271.35 ఎకరాల భూమి ఇండస్ట్రియల్ పార్కుకు కేటాయించనున్నారు.



వైద్యులను ప్రశ్నిస్తున్న భద్రాచలం మాజీ ఎంపీ మిడియం బాబూరావు

బలభద్రపురంలో 102 మందికి పరీక్షలు

అనపర్తి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : బిక్కవోలు మండలం బలభద్రపురంలో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు రెండో రోజైన సోమవారం కొనసాగాయి. స్వతంత్ర హాస్పిటల్, జీఎస్ఎల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం 102 మంది అనుమానితులు వైద్య పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో ఐదుగురికి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. తొమ్మిది మందికి ఎక్స్‌రేలు, 23మందికి అల్ట్రా సౌండ్ స్కేనింగ్‌లు, ఆరుగురికి సర్వేకల్ కేన్సర్ టెస్టులు నిర్వహించారు. బుధవారం కూడా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు.గ్రామంలో జరుగుతున్న వైద్య శిబిరాన్ని సీపీఎం నాయకుడు, భద్రాచలం మాజీ ఎంపీ మిడియం బాబూరావు సందర్శించి వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడి పరిస్థితులు తెలుసుకునేందుకు వచ్చానని వైద్యులను, బాధితులను అడిగి కొన్ని వివరాలు తెలుసుకున్నానన్నారు.పార్టీ పెద్దలతో చర్చించి వివరాలను వెల్లడిస్తానని తెలిపారు.

వైభవోపేతంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు


యాగం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

కొవ్వూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బసివిరెడ్డిపేటలో వేంచేసియున్న శ్రీరాజ్యలక్ష్మీ గోదాసమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మూడోరోజు అత్యంత వైభవంగా జరిగాయి. మంగళవారం ఆలయ అర్చకుడు గొడవర్తి వేణుగోపాలచార్యులు పర్యవేక్షణలో ఆలయ కమిటీ చైర్మన్ దేవగుప్తాపు లక్ష్మణరావు, దంపతులు పీటాలపై కూర్చుని సుదర్శన ఇష్టియాగం నిర్వహించారు. సాయంత్రం చతుస్థానాచార్చనలు నిత్యహవనము, నిత్య పూర్ణాహుతి, బలిహరణ, శ్రీరాజ్యలక్ష్మీగోదా సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి వార్ల పల్లకీసేవ, ఎదురుకోలోత్సవము, నివేదన సమర్పించారు. విశేష అలంకరణ చేసి పూజా కార్యక్రమాలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేదపండితులు, పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆదరణ ఫేజ్ -3తో కులవృత్తిదారులకు చేయూత


కులవృత్తిదారులకు ప్రొఫార్మా అందజేస్తున్న కమిషనర్ నాగేంద్ర కుమార్

కొవ్వూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆదరణ ఫేజ్ - 3 పథకం ద్వారా కుల వృత్తిదారులకు చేయూతనందించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మున్సిపల్ కమిషనర్ టి. నాగేంద్రకుమార్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కులవృత్తిదారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ పట్టణంలో కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారికి మారుతున్న కాలానికి అనుగుణంగా కులవృత్తికి అవసరమైన పనిముట్లను అందించడంలో భాగంగా వారికి అవసరమైన పనిముట్లు, వాటి ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు. తమ జీవనోపాధికి అవసరమైన పనిముట్లకు సంబంధించి పూర్తి వివరాలు అందించినట్టయితే నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. నాయీబ్రాహ్మణ సంఘం నాయకులకు ప్రభుత్వం అందించిన ప్రొఫార్మాను అందజేశారు. ఇందులో పొందుపర్చిన అంశాలను పూర్తిచేసి అందజేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, నాయీబ్రాహ్మణ సంగం నాయకులు మేడూరి వీర్రాజు, కే. రాము, పీ. శ్రీనివాస్, సీహెచ్ ప్రసాద్, పీ. వీరన్న, వి. సూరిబాబు, ఎస్. రమణ, ఏ. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధన


వద్దూరు సమావేశంలో పాల్గొన్న ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు

ఉండ్రాజవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణమాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడం జరిగిందని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు దిద్దే మధుబాబు పేర్కొన్నారు. వద్దూరులో మంగళవారం జరిగిన మండల ఎంఆర్‌పీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల అధ్యక్షుడు, న్యాయవాది బొల్లిపో సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీలోని 59 కులాలకు ఎస్సీ వర్గీకరణ వల్ల సమాన అవకాశాలు లభిస్తాయని, అందువల్ల ఎస్సీ వర్గీకరణను ఎస్సీలోని అందరూ స్వాగతించాలని కోరారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి గాలింకి రాము, మండల కార్యదర్శి మండవల్లి అనిల్‌కుమార్ మాట్లాడారు. అనంతరం వద్దూరు గ్రామ ఎంఆర్‌పీఎస్ కమిటి ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా నందమూరి వినోద్, ఉపాధ్యక్షుడిగా లింగంకోటి నవీన్, కార్యదర్శిగా ఆబోతు ముత్యాలరావు, సహకార్యదర్శిగా చదలవాడ శివదుర్గాప్రసాద్, కోశాధికారిగా చాపల సత్తిపండు, అధికార ప్రతినిధిగా ఉప్పాటి ఆదిత్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు కమిషనర్ టి. నాగేంద్రకుమార్ తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి అధ్యక్షతన జరిగే సమావేశంలో పట్టణంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సంబంధితశాఖల అధికారులు పాల్గొనాలన్నారు.

'కోకో'కు గిట్టుబాటు ధర కల్పించాల్సిందే

- కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన
- ఆర్డీవో రాణీసుస్మితకు వినతి



ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కోకో రైతులు

కొవ్వూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : రైతుల వద్ద గల కోకో గింజలను ప్రభుత్వం గిట్టుబాటు ధర అందించి కొనుగోలు చేయాలని కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట కోకో రైతులు ఆందోళన చేపట్టారు. అనంతరం ఆర్డీవో డా. రాణీసుస్మితకు వినతిపత్రం అందజేశారు. కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ గత నెలరోజులుగా కోకో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్న ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. కోకో గింజలు కొనుగోలు చేసే కంపెనీలు సిండికేట్‌గా మారి ధర తగ్గించి రైతులను నిలువునా మోసగిస్తున్నాయన్నారు. అన్ సీజన్ సాకుతో కోకో గింజలను కొనుగోలు చేయకపోవడంతో కౌలురైతులు తీవ్రంగా నష్ట పోతున్నారన్నారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకోకు ధర ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికి నష్టపోయిన రైతులకు ఇక ఆత్మహత్యలే శరణ్యం అన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించకపోతే రైతులు మరింత నష్టపోతారన్నారు. గత నెలలో కిలో గింజలు రూ. 650 ఉంటే ప్రస్తుతం రూ. 500లకు తగ్గించి రైతులను ఇబ్బందులకు గురిచేశారని, అన్ సీజన్ పేరుతో రూ. 200 నుంచి రూ. 240లకు కొనుగోలు చేస్తున్నారన్నారు. కోకోయ గింజలతో పచ్చళ్ళు పట్టుకోండి అంటూ రైతులను హేళన చేస్తున్నారన్నారు. కోకో గింజలకు రూ. 900 మద్దతు ధర కల్పించకపోతే రైతులు నష్టపోతారన్నారు. ప్రభుత్వం రంగంలోకి దిగి రైతుల నుంచి కోకో గింజలను కొనుగోలు చేయాలని, ధరల స్థిరీకరణ నిధి పథకాన్ని అమలు చేయాలన్నారు. విదేశీ కోకో గింజల దిగుమతిని నిలుపుదల చేయాలన్నారు. ఉద్యాన శాఖ నుంచి రావలిసిన సబ్సిడీ బకాయిలను వెంటనే అందించాలన్నారు. కార్యక్రమంలో రైతులు ఉప్పల కాశీ, నాయుడు లక్ష్మణరావు, ఉండవల్లి కృష్ణారావు, గారపాటి వెంకట సుబ్బారావు, కంకటాల బుద్దుడు, సుభాష్ చంద్రబోస్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. సుందర బాబు, ఆలపాటి శ్రీధర్, సంగీత నాగరాజు, ఆకుల మోహనరావు, బిక్కిన కృష్ణ, జి. శ్రీమన్నారాయణ, ఎంవీవీ సత్యనారాయణ, కొవ్వూరు, చాగల్లు, నిడదవోలు, దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు


స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న దృశ్యం

చాగల్లు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌వీఆర్‌కే ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 25 మంది మలబార్ గోల్డ్ చారిటబుల్ ట్రస్టు తరఫున అందజేసే మెరిట్ స్కాలర్‌షిప్‌కి ఎంపికయ్యారు. మంగళవారం రాజమహేంద్రవరం త్యాగరాజ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఒక్కొరికి రూ. 10 వేలు వంతున ముఖ్యఅతిథులు చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆదిరెడ్డి శ్రీనివాస్ ఇంటర్మీడియట్ బోర్డు ఆర్‌జేడీ శారద, డీవీఈవో జేవీవీ సుబ్రహ్మణ్యం, ఆర్‌ఐవో ఎన్ఎస్‌వీఎల్ నరసింహం, తదితరులు పాల్గొని విద్యార్థులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి. పావని విద్యార్థులను ప్రోత్సహిస్తూ మలబార్ గోల్డ్ ట్రస్టు తరఫున ఉపకార వేతనాలు అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

సోమేశ్వరస్వామి బాలా త్రిపుర సుందరి కల్యాణ మహోత్సవం


కల్యాణ మహోత్సవ దృశ్యం

నిడదవోలు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేంచేసివున్న బాలా త్రిపుర సుందరి సహిత సోమేశ్వరస్వామి పంచాయతన క్షేత్రంలో మంగళవారం సాయంత్రం స్వామి అమ్మవార్ల దివ్యకల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సోమేశ్వరస్వామికి రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, మండపారాధన జరిగాయి. సాయంకాలం జరిగిన కల్యాణ మహోత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాకోళపు లక్ష్మీ నరసింహ శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ ఈవో సోమాల శివ ఏర్పాట్లను పరిశీలించారు.

రైతు నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలి

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

చాగల్లు, మార్చి 25, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల కోసం ప్రతి రైతూ తప్పనిసరిగా రైతు నమోదు చేసుకొని ఆధార్ నెంబరు మాదిరిగా ఐడీ నెంబర్ కలిగి ఉండాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు.మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సభ్యులు లేవనెత్తిన సమస్యలను ఓపికగా విని, సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మహిళలు స్వయం సాధికారిత సాధించడం కోసం మూడు నెలల కుట్టు శిక్షణ ఇచ్చి, వారి అర్హతను బట్టి సుమారు వందమందికి ఉచితంగా కుట్టుమిషన్లు అందజేయనున్నట్టు చెప్పారు. అలాగే జగనన్న కాలనీలలో మౌలిక వసతులు లేవని, రోడ్లు, డ్రైన్లు ఏర్పాటు చేయాలని సభ్యుల విజ్ఞప్తిపై మాట్లాడుతూ గత ప్రభుత్వం ఊరికి దూరంగా కాలనీలు ఇచ్చి కనీస వసతులను కల్పించడంలో నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రస్తుతం పంచాయతీ అధికారులు బాధ్యత తీసుకుని కాలనీలలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేయాలని ఆదేశించారు. ముందుగా గ్రావెల్ రోడ్లు వేసి తరువాత సీసీ రోడ్లు నిర్మాణం చేస్తామన్నారు. పేముల కాలువ వర్షాకాలంలో వచ్చే వరద నీరు వల్ల పంటలు మునిగిపోతున్నాయని గుర్రపు డెక్క, పూడిక తీయించాలని సభ్యులు కోరగా, ఉపాధిహామీ పథకంలో గుర్రపుడెక్క తొలగించడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కాలువ పూడికతీతకు అంచనాలు రూపొందించామని, ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించి పూడి కతీతకు చర్యలు తీసుకుంటామన్నారు. చిక్కాల నుంచి జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరానికి చాగల్లు మీదుగా ఆర్‌టీసీ బస్సు నడపాలని ఎంపీటీసీ సభ్యుడు పిల్లి తిరుమలరావు కోరారు. చెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా చిక్కాలపాలెం చెరువును అభివృద్ధి చేయాలని కోరారు. చిక్కాల నుంచి దేచర్ల వెళ్లే రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరారు. చంద్రవరం నుంచి వాడపల్లి వెళ్లే రోడ్డును అభివృద్ధి చేయాలని ఎంపీటీసీ సభ్యుడు గారపాటి నరసింహమూర్తి కోరారు. ఎంపీపీ మట్టా వీరాస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో ఆర్ శ్రీదేవి, తహశీల్దార్ ఎం.మెరికమ్మ, వైస్ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి బ్యాచ్ ఆగడాలు అరికట్టాలి

సమావేశం అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, తదితరులు మండలంలో స్పెషల్ టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేసి గంజాయి బ్యాచ్ ఆగడాలు అరికట్టాలని ఎమ్మెల్యేను కోరారు. ఊనగట్లలో చెరువు ఆక్రమణలపై సర్వే చేయించి చెరువు పెద్దగా ఉన్న చెరువును పంచాయతీ ఆదాయం వచ్చే విధంగా నాలుగు చెరువులుగా అభివృద్ధి చేయాలని టీడీపీ నాయకులు బొల్లిన శివ నాగేంద్ర కోరారు. అనంతరం మండలంలో పలుగ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించి రూ. 10,76,993 విలువ గల చెక్కులను పది మంది లబ్ధిదారులకు అందజేశారు. టీడీపీ నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభ విద్యార్థులకు బహుమతుల అందజేత


విద్యార్థులకు బహుమతులు, మెమెంటోలు అందజేస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గన్నమని శేషగిరిరావు ప్రతిభా పాటవ పరీక్షల్లో విజేతలకు మంగళవారం బహుమతు ప్రదానం జరిగింది. ఉండ్రాజవరం నెం.1 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు పొందారు. కాల్ధరి గ్రామానికి చెందిన కోమట్లపల్లి వివేక్ జ్ఞాపకార్థం వారితండ్రి కోమట్లపల్లి వెంకటసుబ్బారావు పాఠశాల స్థాయిలో ప్రతిభ కనపర్చిన 10 పాఠశాలల నుంచి 10 మందిని ఎంపిక చేసి ఒక్కొక్క విద్యార్థికి రూ.700 చొప్పున నగదుపురస్కారం, మెమెంటో అందజేశారు. ఎంఈవో సక్సేనరాజు, శారదాజ్యోత్స్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

ఉండ్రాజవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని నిడదవోలు ఎక్సైజ్ సీఐ జె. సతీష్ పేర్కొన్నారు. మంగళవారం దమ్మెన్నులో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఎవేర్‌నెస్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువత వాటికి బానిసలవుతున్నట్టు చెప్పారు. ఎస్సై శ్రీనివాస్, సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

నల్లజర్ల సీఐగా రాంబాబు

నల్లజర్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల సీఐగా వై.రాంబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రాజమహేంద్రవరం క్రైం పోలీస్‌స్టేషన్-3 నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన విజయశంకర్ రాజమహేంద్రవరం క్రైం పోలీస్‌స్టేషన్-2కి బదిలీపై వెళ్లారు.

దొంగలు దోచుకుపోయారు

నిడదవోలు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పురుషోత్తపల్లి గ్రామానికి చెందిన గుర్రం వీర వెంకట సత్య నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు గత నెల 12వ తేదీన ఇంటికి తాళం వేసి కర్ణాటక వెళ్లారు. దీంతో వారు తిరిగి వచ్చి చూసుకునే సరికి ఇంటి తాళాలు పగలుకొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా ఇంట్లోని టీవీ, రూ. పది వేల నగదు, 13 తులాల వెండి పట్టీలు దొంగతనం జరిగినట్టు గుర్తించారు. దీనిపై సమిశ్రగూడెం పోలీసులకు ఫిర్యాదు చేయగా, మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వారు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ మృతి

- హైదరాబాద్ నుంచి బుల్లెట్‌పై వస్తుండగా గామన్ వంతెనపై ఘటన


ప్రవీణ్ కుమార్(ఫైల్)

రాజానగరం, మార్చి25 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని గామన్ బ్రిడ్జి రహదారిపై కొంత మూరు నయారా పెట్రోల్ బంకు వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ పాస్టర్ మృతిచెందారు. ఇందుకు సంబంధించిన వివరాలను రాజానగరం సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్ మంగళవారం విలేకరులకు తెలిపారు. హైదరాబాద్ తిరుమలగిరి సమీపంలోని ఎస్‌టీఎహెచ్ కాలనీకి చెందిన పగడాల ప్రవీణ్ కుమార్ (46) అంతర్జాతీయ క్రైస్తవ ప్రసంగీకుడిగా కొనసాగుతున్నారు. హైదరాబాద్ నుంచి బుల్లెట్‌పై వెనుక లగేజీ బ్యాగ్ కట్టుకుని సోమవారం రాత్రి రాజమహేంద్రవరం బయలుదేరారు. రాజమహేంద్రవరంలో స్నేహితుడి ఇంటికి వెళ్తున్నా నని, భార్యకు చెప్పి బుల్లెట్‌పై బయలుదేరినట్టు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో మార్గమ ధ్యలో సోమవారం అర్ధరాత్రి కొంత మూరు సమీపంలోని నయారా పెట్రోల్ బంకు వద్దకు వచ్చే సరికి మోటార్ సైకిల్ అదుపుతప్పి రహదారి నుంచి పల్లపు ప్రాంతానికి పడిపోవడంతో మోటార్‌సైకిల్ ప్రవీణ్ కుమార్‌పై పడి మృతిచెందినట్టు పోలీ సులు తెలిపారు. మర్నాడు ఉదయం వరకు ఎవరూ గమనించలేదు. మంగళవారం ఉదయం తమకు వచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించామని, బుల్లెట్‌తో సహా ప్రవీణ్‌కుమార్ రహదారి పైనుంచి కిందికి జారిపోవడం, బుల్లెట్ ఆయనపై పడిపోవడంతో మృతిచెందినట్టు సీఐ తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. ఎస్.ఐ మనోహార్ కేసు నమోదు చేశారన్నారు. ఈయన మృతిపై జిల్లాకు చెందిన క్రైస్తవ సంఘాల నాయకులు, పలువురు మతపెద్దలు, రాజకీయ నాయకులు ఆందోళన చేశారు.

హెచ్‌పీసీఎల్, గైల్ ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్


మాక్‌డ్రిల్‌లో పలు సన్నివేశాలు

తాళ్లపూడి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వరకు గల (వీఎస్‌పీఎల్) పెట్రోల్, గ్యాస్ పైపులైన్లు భూమిలోపలికి వెళ్లిన ప్రాంతంలో ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కంపెనీ సిబ్బంది చేపట్టే అత్యవసర చర్యలపై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు తాళ్లపూడి మండలం పోచవరం వద్ద ఔట్ సైడ్ మాక్‌డ్రిల్‌ను మంగళవారం నిర్వహించారు. హెచ్‌పీసీఎల్, గైల్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆర్. త్రినాధరావు అధ్యక్షత వహించారు. పంట పొలాల్లో నుంచి వెళ్లిన పైపులైను వద్ద అనుకోకుండా జరిగిన సంఘటనలతో పైపులైను నుంచి పెట్రోలు, గ్యాస్ లీక్ అయితే వెంటనే తమ కార్యాలయంలో ఎక్కడ ఏప్రాంతంలో జరిగిందో తెలుస్తుందని, దీంతో వెంటనే అక్కడ పనిచేస్తున్న లైన్‌వాకర్‌కు సమాచారం అందిస్తామని చెప్పారు. తమ సంస్థల నుంచి ఫైర్ కార్, అంబులెన్స్ తదితర వాహనాలలో సిబ్బంది వచ్చి ప్రమాదాన్ని ఎలా నివారించాలో తగు చర్యలు తీసుకునే విధానాన్ని తెలిపారు. మంటలను అదుపు చేసే విధానాన్ని ప్రదర్శన రూపంలో చూపించారు. అనంతరం జరిగిన సమావేశంలో పలువురు అధికారులు మాట్లాడుతూ తమ అభిప్రాయాలు తెలిపారు. రాజమహేంద్రవరం ఎంవీఐ సంపత్‌కుమార్ మాట్లాడుతూ ఒకే సెల్‌టవర్‌ను పలు కంపెనీలు వినియోగించుకున్నట్టే ప్రమాదం జరిగిన ప్రాంతంలో హెచ్‌పీసీఎల్, గైల్ కంపెనీలు ఎవరికి వారు తమ సర్వేలైన్స్ పెట్టుకునే కంటే జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసుకుంటే ఇంకా మంచి సేవలు అందించవచ్చన్నారు. గజ్జరం సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రజలకు మాక్‌డ్రిల్‌ను ఎల్‌సీడీ స్క్రీన్లపై ప్రదర్శించి అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రధానంగా పంట పొలాల్లో నుంచి వెళ్లే పైపుల వల్ల ప్రమాదాలు ఎదుర్కొనే రైతులకు మాక్‌డ్రిల్‌లో ప్రాధాన్యత ఉండాలన్నారు. ప్రజలందరికీ భద్రత కలిపిస్తామని ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ స్వాతి తెలిపారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ మాట్లాడుతూ గ్రామాల మీదుగా, పంట పొలాల మీదుగా వెళ్లే ఈ పైపులైను వల్ల ప్రమాదం జరిగితే సమాచారం అందించేందుకు ముఖ్యమైన ప్రదేశాలలో ఎమర్జెన్సీ నెంబర్లను ప్రజలకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పరిశ్రమల జనరల్ మేనేజర్ వీ. రమణ, ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ పీ. నంది, డీఎఫ్‌వో మార్టన్ లూథర్‌కింగ్, హెచ్‌పీసీఎల్ చీఫ్ పంకజ్‌కుమార్, తహశీల్దార్ మోహనభారతి, తాళ్లపూడి మెడికల్ ఆఫీసర్ హారికా గుప్తా, పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మి, వీఆర్‌వో సాయి, పలు ఫ్యాక్టరీల సేఫ్టీ ఆఫీసర్లు, సెల్వం, శ్రీనివాస్, వైడి గణేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు


ఊరేగింపుగా వస్తున్న ఏలూరు పీఠాధిపతి పొలిమెర జయరావు

దేవరపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల ప్రజలు సుభిక్షంగా, సుఖశాంతులతో ఉండాలని ఆ మరియతల్లిని ప్రార్థించినట్టు ఏలూరు పీఠాధిపతి, విశాఖ అగ్రపీఠం అపోస్తోలిక పాలనాధికారి పొలిమెర జయరావు పేర్కొన్నారు. గౌరీపట్నంలో నిర్మలగిరి మహోత్సవాలు గత నాలుగు రోజులుగా ఎంతో ప్రతిష్టాత్మకం గా జనసమూహంతో నిర్వహిం చారు. మంగళవారం ముగింపు సందర్భంగా పలువురు పీఠాధిప తులు, గురువులు దివ్యబలిపూజ కార్యక్ర మాల్లో పాల్గొని భక్తులనుద్దేశించి సందేశాలిచ్చారు. ముందుగా ఏలూరు పీఠాధిపతి పొలిమెర జయరావు, పలువురు పీఠాధిపతులకు గుర్రపుబండిపై ఊరేగింపుగా పుణ్యక్షేత్రానికి తీసుకొచ్చారు. అనంతరం మేరీ మాత మందిరం వద్ద ప్రత్యేక ప్రార్ధనలు జరిపి, దివ్యబలి పూజ నిర్వహించారు. జయరావు మాట్లాడుతూ ఈ ఏడాది ప్రత్యేకత సిల్వర్‌జూబ్లీ జరుపుకోవడం, పలువురు పీఠాధిపతులు రావడం ఎంతో ఆనందదా యకమన్నారు. మద్రాస్ మైలాపూర్ అగ్ర పీఠాధిపతి జార్జి అంతోనిస్వామి మాట్లాడుతూ నిర్మలగిరి పుణ్యక్షేత్రం అశేషజన సమూహంతో భక్తుల పాలిట కొంగుబంగారమన్నారు. ఖమ్మం పీఠాధిపతి సకిలి ప్రకాశ్ మాట్లాడుతూ నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో సిల్వర్‌జూబ్లీ జరుపుకోవడం ఈ పుణ్యక్షేత్రానికి కులాలు, మతాలకు అతీతంగా అశేషజన వాహిని రావడం ఎంతో సంతోషకరమన్నారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ ప్రజలు భక్తి విశ్వాసాలతో పాటు, సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్, రెవరెండ్ ఫాదర్లు కే.విజయాంజిల్, లాము జయరాజు, పీఠాధిపతులు కరణం దమన్ కుమార్, గొరంట్ల జ్యానేస్, పిల్లి అంతోనిదాస్, పుణ్యక్షేత్ర అన్నదాన ట్రస్ట్ కాంట్రాక్టర్ కళ్లే నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి,నల్లజర్ల మండలాల్లో డ్రోన్ల సర్వే



నల్లజర్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయరంగంలో ఆధునిక సాంకేతికత జోడించి ఆయిల్ పాం చెట్లను డ్రోన్ సహాయంతో లెక్కించడం, వాటి ఫ్రెష్ ఫ్రూట్ బంచ్ (ఎఫ్ఎఫ్‌బి)అంచనా వేయడం, చెట్ల ఆరోగ్య పర్యవేక్షణ ఎప్పటికప్పుడు డ్రోన్ సహాయంతో తెలుసుకుని రైతులకు తగు సమాచారం, సూచనలు ఇవ్వడం జరుగుతుందని ఆయిల్ పాం అగ్రి హెచ్ కిలారి శ్రీనివాస్ పేర్కొన్నారు. దేవరపల్లి,నల్లజర్ల మండలంలో పలుచోట్ల ఈ డ్రోన్ సర్వే నిర్వహించినట్టు ఆయన చెప్పారు.

దూబచర్లలో డ్రోన్‌తో పంటలను పరిశీలిస్తున్న దృశ్యం

లయన్స్ 316 బీ గవర్నర్‌గా వజ్రపు కోటేశ్వరరావు

రాజమంహేంద్రవరం సిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి):లయన్స్ జిల్లా 316 బీ ప్రతిష్టాత్మకంగా జరిగిన ఎన్నికల్లో ప్రముఖ సీనియర్ న్యాయవాది వజ్రపు కోటేశ్వరరావు గవర్నర్‌గా ఎన్నికయ్యారు. ఈమేరకు యానాంలో జరిగిన సమావేశంలో జిల్లా 316 బీ గవర్నర్‌గా కోటేశ్వరరావు, 1వ జిల్లా గవర్నర్‌గా సి శ్రీనివాసరావు, 2వ జిల్లా గవర్నర్‌గా పియు మహేశ్వరరావును ఎంపిక చేసినట్టు లయన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈసందర్భంగా వారిని జిల్లా గవర్నర్ ఈవీవీ ఈశ్వర్‌కుమార్, డాక్టర్ టి.లక్ష్మారెడ్డి అభినందించారు.

నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని పునరుద్ధరించాం

- నన్నయ వర్శిటీ వీసీ ప్రసన్నశ్రీ


వీసీ ప్రసన్నశ్రీతో సమావేశమైన డీఆర్‌డీఏ అధికారులు

దివాన్‌చెరువు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నన్నయ వర్శిటీలో కొంతకాలంగా మూసివేసిన నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని పునరుద్ధరించినట్టు వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డీడీజీ మురళి మంగళవారం వీసీని కలిసారు. ప్రస్తుతం నైపుణ్యాభివృద్ధి కేంద్రం అందిస్తున్న కోర్సులపై ఆరాతీసారు. కొంత కాలంగా ఎటువంటి కోర్సులు అందించడంలేదని తెలియడంతో వెంటనే కేంద్రం తెరవాలని వీసీ ఆదేశించారు. వెంటనే మధ్యాహ్నం కే కేంద్రం తెరిచారు. విద్యార్థులతో బాటు నిరాధారంగా ఉన్న మహిళలకు ఉపాధి యోగ్యమైన కొత్తకోర్సులు ఏర్పాటు చేసే విధంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఆమె వెంట నన్నయ నైపుణ్యాభివృద్ధి అధికారి బి.జగన్మోహనరెడ్డి, ఆచార్య పి.సురేష్‌వర్మ, జిల్లా నైపుణ్యాభివృద్ధి కేంద్రం అధికారి ఏఎస్ఆర్ మూర్తి ఉన్నారు. ఇదిలా ఉండగా డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, రెడ్ క్రాస్ జీవిత సభ్యులు జి.మహలక్ష్మి, జిల్లా కోఆర్డినేటర్ పి.రాంబాబు నన్నయ యూనివర్శిటీని సందర్శించి వీసీ ప్రసన్నశ్రీని మర్యాదపూర్వకంగా కలిసారు. వర్శిటీ విద్యార్థులకు రెడ్‌క్రాస్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాల వైపు విద్యార్థులను నడిపించాలన్నారు.

వీసీని సత్కరించిన జీజీయూ ప్రతినిధులు

రాజానగరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జీజీయూ ప్రతినిధులు రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, గైట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.వల్లీమాధవి, డీన్ బి.శ్రీనిసారరాజా మంగళవారం నన్నయ వర్శిటీని సందర్శించి, వీసీని కలిసి సత్కరించారు. వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్తునందించేందుకు రెండు వర్శిటీలు పరస్పర సహకారంతో పనిచేస్తాయని, రెండింటి మధ్య విద్య, పరిశోధన, విద్యార్థుల అభివృద్ధి రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకునే విషయాలపై చర్చించారు.